



రుషికొండపై భవనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే సుందరపు

ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

» విజయనగరం జిల్లా పర్యటన అనంతరం తిరుగు ప్రయాణంలో రుషికొండపై భవనాలు పరిశీలన

గోపాలపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సోమవారం విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. విజయనగరం జిల్లా గుర్ల మండలంలో డయేరియా బాధిత కుటుంబాలను పరామర్శించడానికి విజయవాడ నుంచి ఉదయం పది గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న పవన్ కల్యాణ్‌కు ఎంపీ ఎం.శ్రీభరత్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, గ్రేటర్ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో విజయనగరం వెళ్లారు. అక్కడ నుంచి తిరుగు ప్రయాణంలో రుషికొండను సందర్శించారు. ఎంపీ ఎం.శ్రీభరత్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, జనసేన నాయకులతో కలిసి ఆ భవనాన్ని బయట నుంచే ఆమూలాగ్రం చూశారు. భవనానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెప్పించుకొని ఏమి చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని పార్టీ నాయకులకు చెప్పారు. అనంతరం ఐదు గంటలకు విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో విజయవాడ వెళ్లారు.



అమరవీరులకు ఘన నివాళి

బీచ్‌రోడ్డులోని అమరవీరుల స్థూపం వద్ద సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ శంఖబ్రత బాగ్చీ, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఘన నివాళులర్పించారు. ఏఆర్ సిబ్బంది నిర్వహించిన పరేడ్ ఆకట్టుకుంది. - 8లో

వీఎంఆర్‌డీఏలో దళారులకు చెక్

ప్లానింగ్ విభాగంలో అవినీతికి అడ్డుకట్ట వేయడంపై ఉన్నతాధికారి దృష్టి

కార్యాలయంలోకి రాకుండా చర్యలు

» సరైన కారణాలు లేకుండా ఫైల్ తొక్కి పెడితే సిబ్బందిపై యాక్షన్

» దరఖాస్తుదారులకు సాయంత్రం 4 గంటల తరువాతే ఎంట్రీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్లానింగ్ విభాగంలో అవినీతిని రూపుమాపడంపై ఉన్నతాధికారి దృష్టిసారించారు. ఈ క్రమంలో మొదట దళారులు రాకుండా చెక్ పెట్టారు. ఎవరి సీటు దగ్గరైనా దళారులు కనిపిస్తే ఆ ఉద్యోగిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సెక్యూరిటీకి కూడా గట్టి వార్నింగే ఇచ్చారు.

లేఅవుట్లకు, భవనాలకు అనుమతులు తీసుకోవాలంటే...వీఎంఆర్డీఏ ప్లానింగ్ విభాగంలో సంబంధిత సిబ్బందిని ప్రసన్నం చేసుకుంటే తప్ప పని జరగడం లేదు. నేరుగా దరఖాస్తుదారులు వెళితే సిబ్బంది వారిని మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారు. దరఖాస్తు చేసిన లేఅవుట్లకు సంబంధించి ఇంకా ఏయే పత్రాలు సమర్పించాలో ఒకేసారి చెప్పకుండా ఒక్కోసారి ఒక్కోటి చెబుతూ కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు. ఇలా నెలల తరబడి తిరిగినా పనులు పూర్తికావడం లేదు. అయితే దరఖాస్తుదారులు నేరుగా వెళ్లకుండా దళారులను ఆశ్రయిస్తే మాత్రం...రోజుల్లోనే పనులు పూర్తయిపోతున్నాయి. ప్లానింగ్ విభాగంలో ఏ టేబుల్ వద్ద ఎవరికి ఏమి ఇస్తే పని జరుగుతుందో బాగా తెలిసిన దళారులు..వారికి వాటిని సమకూర్చి పనులు చేయించుకుంటున్నారు. ఈ దళారులు కూడా వీఎంఆర్‌డీఏ ఉద్యోగుల్లాగే కార్లలో రోజూ ఆఫీసుకు వస్తుంటారు. సెక్యూరిటీ గార్డులకు భారీగా నజరానాలు ఇచ్చి వారితో సెల్యూట్ కొట్టించుకుంటారు. పోర్టికో ఎదురుగానే కార్లు పార్కింగ్ చేసుకొని ప్లానింగ్ విభాగంలోకి వెళతారు. అక్కడ ప్లానింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారుల పక్కనే కుర్చీల్లో కూర్చొని కంప్యూటర్లలో ఫైళ్లు తెరిపించి పనులు చేయించుకుంటున్నారు. ఇలా చాలాకాలంగా జరుగుతోంది.

ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చాక ప్లానింగ్ విభాగంలో పనుల జాప్యంపై పలువురు నేరుగా పురపాలక శాఖా మంత్రి నారాయణకే ఫిర్యాదు చేశారు. దాంతో ఆయన విశాఖపట్నం వచ్చినప్పుడు వీఎంఆర్‌డీఏలో సమీక్ష నిర్వహించి, ఫిర్యాదీలను రప్పించారు. వారి ఫైళ్లను ఎందుకు క్లియర్ చేయడం లేదో, కారణాలు ఏమిటో చెప్పాలని అందరి ముందే సిబ్బందిని ప్రశ్నించారు. లేఅవుట్‌కైనా, భవనానికైనా అన్నీ పరిశీలించి షార్ట్ ఫాల్ నోటీసు ఒకసారే ఇవ్వాలని ఆదేశించారు. సమగ్రంగా పరిశీలించకుండా దరఖాస్తుదారు వచ్చిన ప్రతిసారి కొత్త సమస్య చెబితే కావాలనే తిప్పించినట్టుగా భావించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇకపై ఎవరైనా నిర్ణీత సమయానికి మించి ఫైల్‌ను వారి దగ్గర పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఆ విభాగంలో ఫైల్ కింది నుంచి పైవరకు ఎన్ని రోజుల్లో వెళ్లాలో షెడ్యూల్ తయారు చేయించారు. అంతకు మించి జాప్యం చేస్తే తనకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఎవరి సీటు దగ్గరైనా దళారులు ... మిగతా 6వ పేజీలో



వీఎంఆర్‌డీఏలోని ప్లానింగ్ విభాగం

25న జిల్లా అభివృద్ధిపై ఇన్‌చార్జి మంత్రి సమీక్ష

» అన్ని విభాగాల హెచ్‌వోడీలు పూర్తి వివరాలతో హాజరు కావాల్సిందిగా కలెక్టర్ ఆదేశం

» 24న జడ్పీ సమావేశానికీ పక్కా నివేదికలతో రావాలని సూచన

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి ఈనెల 25వ తేదీన జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తారని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. ఇన్‌చార్జి మంత్రి హోదాలో తొలిసారి వస్తున్న ఆయన ఆరోజు మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో భేటీ అవుతారన్నారు. సోమవారం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, ఇంకా ... మిగతా 6వ పేజీలో

ముగిసిన టెట్

పరీక్షకు 85.63 శాతం మంది హాజరు

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణ సోమవారంతో ముగిసింది. ఈ పరీక్షలు ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో ఈనెల మూడో తేదీన ప్రారంభమయ్యాయి. మొత్తం 60,547 మందికి హాల్ టిక్కెట్లు జారీచేయగా 51,847 (85.63 శాతం) మంది హాజరైనట్టు విశాఖపట్నం డీఈవో చంద్రకళ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించింది. దీనికి అనుగుణంగా టెట్ నిర్వహించింది. ఫలితాలు త్వరగా వెల్లడించి అనంతరం డీఎస్సీ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని నిరుద్యోగ ఉపాధ్యాయులు కోరుతున్నారు.

మాస్టర్‌ప్లాన్ రోడ్డు ఆక్రమణ!

పీఎంపాలెంలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు



పీఎం పాలెంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రోడ్డుపైకి నిర్మాణాలు

» రెసిడెన్షియల్ పేరుతో ప్లాన్ తీసుకుని వాణిజ్య భవన సముదాయం నిర్మాణం

» సెల్లార్‌లో దుకాణాలు.. అంతేగాకుండా రోడ్డు వైపు ఆరు అడుగుల మేర ఆక్రమించి షెడ్లు ఏర్పాటు

» వాహనాల రాకపోకలకు అంతరాయం

» చోద్యం చూస్తున్న టౌన్‌ప్లానింగ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పోతినమల్లయ్యపాలెంలో విజేత సూపర్ మార్కెట్ నుంచి సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లే మాస్టర్ ప్లాన్ రోడ్డు ఆక్రమణలతో బక్కచిక్కిపోయింది. రోడ్డును ఆక్రమించి మరీ షాపింగ్ కాంప్లెక్స్‌లు, దుకాణాలు నిర్మించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఈ క్రమంలో తరచూ ప్రమాదాల చోటుచేసుకుంటున్నాయి. అయినా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులుగానీ, వీఎంఆర్‌డీఏ అధికారులుగానీ పట్టించుకోవడం లేదు.

పీఎం పాలెం కార్‌షెడ్ జంక్షన్ నుంచి బక్కన్నపాలెం ఆఖరి బస్టాప్ వరకూ వీఎంఆర్‌డీఏ 80 అడుగులు మాస్టర్ ప్లాన్ రోడ్డు ఉంది. ఆ రోడ్డులో ఉన్న విజేత సూపర్ మార్కెట్ నుంచి క్రికెట్ స్టేడియం వెనుక వైపు ఉన్న సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీ వరకూ 60 అడుగుల మాస్టర్‌ప్లాన్ రోడ్డును వీఎంఆర్‌డీఏ ఇటీవలే నిర్మించింది. రోడ్డు ... మిగతా 6వ పేజీలో

జోన్ స్థాయిలో సమీక్షలు

» జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ నిర్ణయం

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో వివిధ విభాగాల మధ్య సమన్వయలోపం కారణంగా పెండింగ్‌లో ఉండిపోయిన ప్రజా సమస్యల పరిష్కారానికి ఇకపై జోన్‌ల వారీగా సమీక్షలు నిర్వహించాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్ నిర్ణయించారు. అందులో భాగంగా తొలుత మంగళవారం జోన్-2 కార్యాలయంలో అధికారులతో సమావేశం కానున్నారు. ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, హార్టికల్చర్, నీటి సరఫరా విభాగాల మధ్య సమన్వయ లోపంతో కొన్నిపనులు పెండింగ్‌లో ఉండిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందిపడుతున్నారని కమిషనర్ గుర్తించారు. ఏళ్లతరబడి సమస్యలు పరిష్కారం కాకపోతే జీవీఎంసీపైనా, రాష్ట్ర ప్రభుత్వంపైనా అసంతృప్తికి గురయ్యే అవకాశం ఉందని కమిషనర్ భావిస్తున్నారు. అందుకు అవకాశం లేకుండా అన్ని విభాగాల అధిపతులతో కనీసం నెలకు ఒక జోన్‌లోనైనా పెండింగ్ సమస్యలపై సమీక్ష నిర్వహించడం వల్ల ఫలితం ఉంటుందని కమిషనర్ ఆశిస్తున్నారు.

ముడి వీడుతోంది



» నవ దంపతుల్లో పెరుగుతున్న అసహనం

» వివాహమైన ఐదేళ్లలోపే పెటాకులు - 8లో

ఫుట్‌పాత్‌ను ఆక్రమించి దుకాణాలు

- దళారుల కొత్త దందా
- రోజుకు రూ. 500 నుంచి రూ. 1000 వరకూ అద్దె వసూలు
- వ్యాపారులంతా ఇతర రాష్ట్రాలకు చెందినవారే





రామ్‌నగర్ సమీపంలో సిరిపురం వైపు వెళ్లే రహదారిలో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దుకాణాలు

రామ్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇదో కొత్త తరహా వ్యాపారం. రామ్‌నగర్ సమీపంలో సిరిపురం వైపు వెళ్లే రహదారిలో కొందరు దళారులు ఏకంగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి, రోజు వారీ అద్దెకు ఇస్తున్నారు. ఒక్కొక్క దుకాణం నుంచి రోజుకు సుమారు రూ.500 నుంచి రూ. 1000 వరకూ అద్దె వసూలు చేస్తున్నారు. వ్యాపారులంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కావడంతో దళారుల ఇష్టారాజ్యమైంది. వ్యాపారులు రోజు వారీ అద్దె చెల్లించి మరీ వ్యాపారాలు చేసుకుంటున్నారు, ప్రస్తుతం ఈ ప్రాంతం మరో ఫుడ్ కోర్టులా మారడంతో కొనుగోలుదారులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. దీంతో రోడ్డుకి ఇరువైపులా వారు వాహనాలను నిలిపి వేస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఆరేడు నెలలుగా ఈ పరిస్థితి ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. దళారులు ఎటువంటి అనుమతి లేకుండా ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్నా.. అడిగే నాథుడే కరువయ్యాడు.



రోడ్డుపై పడి ఉన్న బండరాయి

కొండ చరియను తొలగించరా?

ఆరిలోవ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హనుమంతవాక జంక్షను జాతీయ రహదారి వద్ద కొండపై నుంచి సుమారు నెల కిందట పెద్ద బండరాయి రోడ్డుపైకి జారి పడింది. ఇంతవరకు దీన్ని తొలగించకపోవడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం పెద్ద సంఖ్యలో వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు అధికారులు కూడా ఇలాగే వెళ్తుంటారు. కొండచరియ విరిగి పడిందన్న విషయం తెలిసిన వాహనదారులు రాత్రి సమయంలో ఇక్కడ జాగ్రత్తగా వెళ్తున్నా, తెలియని వారు ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే దీన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం... మూగజీవులకు శాపం



వ్యర్థాలు తింటున్న పశువు

ఆరిలోవ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెత్త కుండీల వద్ద వ్యర్థాలు తిని మూగజీవులు అనారోగ్యంతో మృతి చెందుతున్నాయి. జీవీఎంసీ 10వ వార్డులోని ఆదర్శనగర్ కూడలిలో ఒక బార్ సమీపంలో ఉన్న చెత్త కుండీ పూర్తిగా నిండిపోయి చెత్త బయటకు వస్తోంది. మూగ జీవులు వచ్చి ప్లాస్టిక్ కవర్లతో కూడిన వ్యర్థాలు తింటున్నాయి. ఇవి అరగక ముద్దలుగా ఉండిపోయి కడుపు నొప్పి బారిన పడి మృతి చెందుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తే మూగ జీవులు అక్కడ చేరవు. వ్యర్థాల నిల్వ కారణంగా ఈప్రాంతంలో దుర్వాసన వ్యాపిస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రిఫరల్ వైద్యశాలకు జ్వరపీడితుల తాకిడి

ఆరిలోవ,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ రిఫరల్ వైద్యశాలకు రోజూ సగటున 20 మంది వైరల్ జ్వరపీడితులు చికిత్స కోసం వస్తున్నట్లు వైద్యాధికారిణి డాక్టర్ అనిత తెలిపారు. ఐదారుగురికి ర్యాబిస్ నివారణ ఇంజక్షన్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 200 మంది రోజూ ఓపీకి వస్తుంటారని, వీరికి ఆరుగురు వైద్యులు సేవలు అందిస్తున్నారన్నారు. అందరికీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నటు తెలిపారు. వారానికి సుమారు 10 ప్రసవాలు, నెలలో సుమారు 60 ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు వివరించారు.

సీనియర్ సహాయకులకు పదోన్నతి

వెంకోజీపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సీనియర్ సహాయకులు పీఎస్ఎస్ ప్రసన్న, వై. ఎల్లమనాయుడుకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ కమిషనర్ సంపత్‌కుమార్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు సోమవారం ఆయన తన కార్యాలయంలో పదోన్నతి పొందిన వారికి ఉత్తర్వులు అందించి, అభినందించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పదోన్నతి ఉద్యోగులకు మరింత బాధ్యతను గుర్తుచేస్తుందన్నారు. విధి నిర్వహణలో సక్రమంగా పనిచేసి, నగరాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

16, 17 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

అల్లిపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా ఏఐఎస్ఎఫ్ 32వ మహాసభలు నవంబరు 16, 17 తేదీల్లో నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏపీడీల బాధ్యతల స్వీకరణ

జ్ఞానాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జోన్-5 కార్యాలయంలో 23 వార్డులకు సంబంధించి ఇద్దరు ఏపీడీలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జోనల్ కమిషనర్ రాము నుంచి ఉత్తరంలో పూర్తిగా, దక్షిణంలో ఒక వార్డుకు పుణ్యవతి, పశ్చిమలోని వార్డులకు కృపానందం ఏపీడీలుగాని యమితులయ్యారు. వీరు ఇంతవరకు జోన్-4 సూర్యాబాగ్ కార్యాలయంలో పనిచేసేవారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సంపత్ కుమార్

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన వినతు లను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీకి సంబంధించిన ప్రజా ఫిర్యాదులు, కోర్టు కేసులు, ఆడిట్ అభ్యంతరాలు, ఈ-ఆఫీస్ తదితర అంశాలపై జీవీఎంసీ విభాగాధిపతులు, స్టేట్ ఆడిట్ రీజనల్ డైరెక్టర్ సీతారామారావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జోనల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నగర ప్రజలకు కల్పించవలసిన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు, తదితర అంశాలపై వస్తున్న ఫిర్యాదులకు ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక శ్రద్ధతో నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, వీధి లైట్ల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదే శించారు. ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే జీవీఎంసీకి సంబంధించిన కోర్టు కేసులు, రిట్ పిటిషన్లపై ప్రత్యేక శ్రద్ధ చూపి, కేసులు తీవ్రతను తగ్గించాలన్నారు.

కేజీహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స



రోగికి శస్త్ర చికిత్స చేసిన వైద్యులు

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లోని కార్డియో థొరాసిక్ వాస్కులర్ సర్జరీ విభాగంలో అరుదైన శస్త్ర చికిత్సను వైద్యుల బృందం విజయవంతంగా పూర్తిచేసింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమండ్రికి చెందిన హరికృష్ణ (34) కొద్ది నెలలుగా తీవ్రమైన దగ్గుతో ఇబ్బందిపడుతున్నాడు. ఆరు నెలల నుంచి దగ్గుతోపాటు రక్తం పడుతోంది. అనేక మంది వైద్యులకు చూపించినా ప్రయోజనం లేకుండా పోయింది. హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా రూ. 10 లక్షల నుంచి రూ.15 లక్షలు వరకు ఖర్చవుతుందని చెప్పారు. అంత మొత్తం వెచ్చించే స్థోమత లేక ఈ నెల పదో తేదీన కేజీహెచ్‌లో చేరాడు. అదేరోజు మెడికల్ వార్డు నుంచి కార్డియో థొరాసిక్ విభాగానికి వైద్యులు రిఫర్ చేశారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు థ్రాంబోస్‌గా నిర్ధారించారు. అంటే, గుండె నుంచి ఊపిరితిత్తులకు చెడు రక్తాన్ని తీసుకువెళ్లే పల్మనరీ ఆర్టెరీలో రక్తం గడ్డ కట్టడం. ఆ గడ్డను తొలగించేందుకు వైద్యులు సర్జరీకి సిద్ధమయ్యారు. శస్త్ర చికిత్స వల్ల ఒక్కోసారి రోగి ప్రాణానికి ప్రమాదం ఉంటుందన్న విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారి అనుమతితో ఈనెల 11న సుమారు నాలుగు గంటలపాటు శస్త్ర చికిత్స నిర్వహించి పల్మనరీ ఆర్టెరీలో గూడు కట్టిన గడ్డను తొలగించారు. ఈ ప్రక్రియను వైద్య పరిభాషలో పల్మనరీ థ్రాంబో ఎంబోలెక్టమీ లేదా పల్మనరీ థ్రాంబెక్టమీ అంటారు. లంగ్స్ వరకు రక్తం గడ్డ కట్టినట్టు గుర్తించిన వైద్యులు మొత్తాన్ని తొలగించారు. దీంతోపాటు రోగి ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నాడు. శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్య బృందాన్ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద సోమవారం ఉదయం అభినందించారు. శస్త్ర చికిత్సను కార్డియోథొరాసిక్ విభాగానికి చెందిన వైద్యుల బృందం డాక్టర్ కె.మణిత, డాక్టర్ ఎ.పద్మజ, అనస్థీషియా వైద్యులు డాక్టర్ సతీష్, డాక్టర్ రమేష్, డాక్టర్ భవానీ నిర్వహించారు. ఈ తరహా కేసులను రాష్ట్రంలో ఎక్కడా చేయలేదని, దాదాపు 90 శాతం కేసుల్లో ప్రాణానికి ప్రమాదం ఉంటుందని, విజయవంతంగా శస్త్ర చికిత్సను పూర్తిచేయడం ఆనందంగా ఉందని డాక్టర్ పద్మజ తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

సోలార్ పథకాన్ని వినియోగించుకోండి

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన వినియోగించుకోవడం ద్వారా ప్రతినెలా విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవచ్చని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. సోమవారం ఆయన ఎంవీపీ కాలనీలోని తన కార్యాలయంలో పథకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్యాంబాబు,ఈఈ సింహాచలంనాయుడు, డీఈఈ సుమన్, ఏఈ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ



మాట్లాడుతున్న రీసోర్స్‌పర్సన్ ఎస్‌పి బాబు

వెంకోజీపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం, యువజన సర్వీసుల శాఖ, విజయవాడ ఆదేశాల మేరకు సెట్విస్ ఆధ్వర్యంలో ఇసుకతోట బాసర జూనియర్ కళాశాలలో సోమవారం వ్యక్తిత్వ వికాసం, యూత్ క్లబ్‌ల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రీసోర్స్ పర్సన్ ఎస్‌పి బాబు మాట్లాడుతూ సాంకేతిక విద్య అభ్యసిస్తున్న యువత, ఇంగ్లీషు, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాలపై అవగాహన కల్పించుకుని, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు పొందాలని చెప్పారు. ప్రస్తుతం అనేక అవకాశాలు ఉన్నా.. నైపుణ్యం గల మానవ వనరుల కొరత ఉందన్నారు. ఉద్యోగానికి కావాల్సిన విద్యార్హతలు ఉన్నా, ఇంటర్వ్యూలలో ఒత్తిడికి గురవుతూ సరైన కమ్యూనికేషన్ స్కిల్స్ లేక ఉద్యోగాలు పొందలేకపోతున్నారని తెలిపారు. చదువుతున్న కోర్సులు పూర్తయిన తరువాత వృత్తి నైపుణ్య కోర్సులు కూడా నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. సూర్యకిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాయపడిన నాగుపాముకు వైద్య సేవలు



పాముకు చికిత్స చేస్తున్న డాక్టర్ లావణ్య

అగనంపూడి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముంగిస దాడిలో గాయపడిన నాగుపాముకు సోమవారం నగర పరిధిలోని అగనంపూడి పశువుల ఆస్పత్రిలో వైద్యురాలు చికిత్స అందించారు. వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి బీసీ కాలనీలోని ఓ ఇంటి ముందు నాగుపాము, ముంగిస తలపడ్డాయి. స్థానికులు భయంతో ఈవిషయాన్ని స్నేక్ క్యాచర్ అయిన కిరణ్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. అతను అక్కడకు చేరుకుని అప్పటికే గాయపడిన నాగుపామును పట్టుకొని స్థానిక పశు వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్కడ వైద్యాధికారిణి లావణ్య పాముకు చికిత్స అందజేశారు. నాగుపాముకు మంగళవారం మరొకసారి వైద్యం చేయించి కొండ ప్రాంతంలో విడిచి పెడతానని కిరణ్ తెలిపారు.

25న జిల్లా అభివృద్ధిపై ఇన్‌చార్జి మంత్రి సమీక్ష

... 5వ పేజీ తరువాయి

పరిపాలనాపరమైన అంశాలపై ఇన్‌చార్జి మంత్రి చర్చిస్తారన్నారు. అన్ని విభాగాల హెచ్‌ఓడీలు తమ తమ శాఖల్లో చేపట్టిన పనులపై పూర్తిస్థాయి నివేదికలతో హాజరుకావాలన్నారు. అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. అదే రోజు ఉదయం ఆనందపురం మండలం 'సీ' కన్వెన్షన్ హాలులో భీమిలి నియోజకవర్గ సమీక్ష ఉంటుందన్నారు. కాగా ఈనెల 24వ తేదీన జరగనున్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి పక్కా నివేదికలతో అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. గతంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలపై చేపట్టిన చర్యలను క్షుణ్ణంగా వివరించాలన్నారు. సమావేశం నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు.

మాస్టర్ ప్లాన్ రోడ్డు ఆక్రమణ

... 5వ పేజీ తరువాయి

నిర్మాణం సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలను కొంతమేర తొలగించారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించి, విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేశారు. రోడ్డును భారీగా విస్తరించడంతో షాపులకు డిమాండ్ పెరిగింది. దీంతో కొంతమంది రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీపై సిమెంట్ పలకలు వేసి, ర్యాంపులు నిర్మించి దుకాణాలు పెట్టేశారు. ఒకరైతే ఏకంగా నివాస భవనం నిర్మాణానికి జీవీఎంసీ నుంచి ప్లాన్ తీసుకుని ఏకంగా మూడంతస్తులు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేశారు. రోడ్డు ముందువైపు సెట్‌బ్యాక్ , పార్కింగ్ కోసం సెల్లార్‌ను విడిచిపెట్టాల్సి ఉన్నప్పటికీ డ్రైనేజీ వరకూ భవనం నిర్మించేశారు. సెల్లార్‌లో కూడా ఐదు దుకాణాలు ఏర్పాటుచేయడమే కాకుండా డ్రైనేజీపై సిమెంట్ పలకలు వేసి కప్పేశారు. రోడ్డును ఆరు అడుగులు వరకూ ఆక్రమించేసి దుకాణాల ముందు రేకులు షెడ్లు ఏర్పాటుచేశారు. అక్కడ వినియోగదారులంతా కూర్చునేలా టేబుళ్లు, కుర్చీలను ఏర్పాటుచేశారు. ఆ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు వచ్చేవారంతా తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో మాస్టర్ ప్లాన్ రోడ్డులోని ఒక లైన్ వాహనాలతో నిండిపోవడంతో రెండో లైన్‌లోనే వాహనాల రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని సందర్భాల్లో అక్కడకు వచ్చేసరికి వాహన చోదకులు ఏమరుపాటుగా ఉంటే పక్కనే పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను తగులుతుండడంతో తరచూ గొడవలు అవుతున్నాయి. అక్రమ నిర్మాణాలు, రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎందుచేతనో అటువైపు కన్నెత్తి చూడడం లేదు. మరోవైపు కొత్తగా నిర్మించిన రోడ్డును ఆక్రమించినా, రోడ్డు అలైన్‌మెంట్‌ను దెబ్బతీసేలా వ్యవహరించినా వీఎంఆర్‌డీఏ అధికారులు సైతం పట్టించుకోకపోవడం ఆశ్చర్యపరుస్తోంది. ఇప్పటికైనా జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు మాస్టర్‌ప్లాన్ రోడ్డులో ఆక్రమణలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డును ఆక్రమించి, నిర్మించిన దుకాణం

ఉద్యోగం ఆశ చూపి రూ.20 లక్షలకు మస్కా!

ఆరిలోవలో కి'లేడీ' బాగోతం

ఆరిలోవ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ఫ్యాషన్ డిజైనింగ్ కంపెనీలో కీలక బాధ్యతల్లో ఉన్న తనకు అందరితో మంచి పరిచయాలు ఉన్నాయంటూ మాటలతో నమ్మబలికి ఆరిలోవకు చెందిన ఓ మహిళ నుంచి రూ.20 లక్షలు కొట్టేసింది. పోలిపిల్లి సువర్ణ అనే బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరిలోవ సుందరయ్యనగర్‌లో నివసిస్తున్న నీలాపు స్వాతితో సువర్ణకు పరిచయమైంది. ఆమె అందరి తలలో నాలుకలా ఉండేది. ఈ క్రమంలో సువర్ణ, ఆమె భర్తకు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మ బలికింది. వారితో రూ. 20 లక్షల విలువ చేసే వస్తువులు కొనిపించింది. అదే కాలనీలో నివసిస్తున్న వంగలపూడి రాణి, సువర్ణలతో స్వాతి పరిచయం పెంచుకుంది. నగరంలో మంజు ఫ్యాషన్ డిజైనింగ్ కార్యాలయంలో పనిచేస్తున్నానని, సంస్థ నిర్వాహక దంపతులకు డిజైనింగ్ చీరలు, ఇతర వస్తువులను సరఫరా చేసేందుకు బైక్‌లు కావాలంది. వాటిని తనకు ఇప్పిస్తే సువర్ణ భర్తకు మంచిఉద్యోగం వేయిస్తానని నమ్మించింది. కొనుగోలు చేసిన వస్తువులకు ప్రతి నెలా ఈఎంఐ పద్ధతిలో డబ్బులు చెల్లిస్తామని ఒప్పించి సుమారు రూ.20 లక్షలు విలువ చేసే బైక్‌లు, ఏసీలు, ఇతర వస్తువులను సువర్ణతో కొనిపించింది. కానీ ఇంతవరకు ఎటువంటి ఉద్యోగం ఇప్పించలేదు. ఈఎంఐలు చెల్లించకపోవడంతో ఆమె ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వీఎంఆర్‌డీఏలో దళారులకు చెక్

... 5వ పేజీ తరువాయి

కనిపిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దరఖాస్తుదారులు ఎవరైనా సరే వారి సమస్యలు చెప్పుకోవడానికి సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్యనే రావాలని సూచించారు. ఇదే విషయం స్పష్టం చేస్తూ ఆ సెక్షన్ బయట నోటీస్ పెట్టించారు. ఆ సమయంలో కాకుండా మధ్యలో ఎవరు వచ్చినా లోపలకు అనుమతించకుండా చూడడానికి ఒకరిని నియమించారు. ఎవరు వస్తున్నారో, ఎవరిని కలుస్తున్నారో తెలుసుకోవడానికి సీసీ టీవీ కెమెరాలతో పాటు ప్రత్యేకంగా ఒక పుస్తకం కూడా పెట్టించారు. ఈ చర్యల తరువాత దళారులు కొంతవరకు కనుమరుగయ్యారు. అయితే 'ఆఫీసులోకి రానివ్వకపోతే మా పనులు చేయించుకోలేమా?, ఎదురుగా రెస్టారెంట్‌లో కూర్చొని మాట్లాడుకుంటాం' అంటూ దళారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఒక్క విభాగాన్ని ట్రాక్‌లో పెడితే వీఎంఆర్‌డీఏకు చాలావరకు చెడ్డపేరు తగ్గిపోతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఎంత మేరకు ఫలితాలు వస్తాయో వేచి చూడాల్సిందే.



పది నాణేలపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

రూ. పది నాణెల వాడకంపై అవగాహన

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పది రూపాయల నాణెం చెల్లదంటూ కొందరు వ్యాపారులు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. దీంతో వినియోగదారులు కూడా చెల్లవేమోనని నాణేలను వారు కూడా వినియోగించడం లేదు. వ్యాపారులు కూడా తీసుకోవడం మానేశారు. దీంతో ఈ అపోహలను తొలగించడానికి బ్యాంకు ఆఫ్ బరోడా అధికారులు సోమవారం ఎంవీపీ కాలనీ రైతు బజారులోని రైతులు, వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రూ. పది నాణెం నిరభ్యంతరంగా చలామణిలో ఉంచుకోవాలని సూచించారు. ఎవరూ నిరాకరించడం లేదా, చెల్లదంటూ అసత్య ప్రచారాలు చేయకూడదని పేర్కొన్నారు.

గంజాయి తాగేవారిని నియంత్రించాలని వినతి



సీఐకి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేత సన్యాసిరావు

ఆరిలోవ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవలో గంజాయి పీల్చేవారిని నియంత్రించి, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు బృందం సీఐ మల్లేశ్వరరావును కోరింది. ఆరిలోవ శాంతిభద్రతల సీఐగా బాధ్యతలు చేపట్టిన సీఐ మల్లేశ్వరావును ఒమ్మి సన్యాసిరావు తదితరులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు బుడుమూరు గోవింద్, పార్లమెంటరీ నాయకులు ఒమ్మి పోలారావు, రాజారావు తదితరులు ఆయనను కలిసినవారిలో ఉన్నారు.

'పర్యావరణ హిత దీపావళి నిర్వహిద్దాం'



శివాజీపాలెం ప్రభుత్వ పాఠశాలలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితంగా దీపావళిని నిర్వహించుకుందామని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో సంస్థ పేర్కొంది. శివాజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎకో వైజాగ్ పేరిట కాలుష్య నియంత్రణకు అందరూ కృషి చేయాలని సూచించారు. బాణసంచా కారణంగా పశుపక్ష్యాదులు, మొక్కలు, చెట్లు, వృద్ధులు, పిల్లలకు హాని కలగకుండా ఈ దీపావళిని నిర్వహించుకోవడానికి అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, ఎ.యు. సోషల్ వర్క్ విద్యార్థినులు ఉషారాణి, తేజస్విని, ఆడమ్, చైతన్య సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీకి రూ.39.19 లక్షల ఆదాయం



కమిషనర్‌కు చెక్కు అందిస్తున్న హెచ్‌పీసీఎల్ అధికారులు

వెంకోజీపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ వాహనాలకు హెచ్‌పీసీఎల్ ఇంధనం వినియోగం వల్ల రూ. 39.19 లక్షలు లాయల్టీ పాయింట్ల ద్వారా ఆదాయం లభించిందని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో హెచ్‌పీసీఎల్ లాయల్టీ పాయింట్ల ద్వారా జీవీఎంసీకి చేకూరిన రూ.39.19లక్షల చెక్కును హెచ్‌పీసీఎల్ రీజనల్ మేనేజర్ బి. రవికాంత్ నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవీఎంసీ మెకానికల్ విభాగం ద్వారా జీవీఎంసీకి చెందిన అన్ని వాహనాలకు హెచ్‌పీసీఎల్ ఇంధనం వినియో గించడం వల్ల రూ.39.19 లక్షలు ఆదాయం లభించిందని చెప్పారు. నగరంలో హెచ్‌పీసీఎల్ ఇంధనం సరఫరా చేసే పరిశ్రమలు, సంస్థల్లో జీవీఎంసీ ప్రథమ స్థానంలో ఉండడమే కాకుండా మూడేళ్లకు గానూ అత్యధిక లాయల్టీ పాయింట్లను పొందడం ద్వారా ఈ ఆదాయం చేకూరిందన్నారు. అనంతరం కమిషనర్ జీవీఎంసీ మెకానికల్ విభాగం ఇంజనీర్లను అభినందించారు.

25న జాబ్‌మేళా

కంచరపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ సమీపంలో గల నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఉప ప్రాంతీయ ఉపాధి కల్పన అధికారి శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు. ఇందులో ముత్తూట్ ఫిన్ కార్పొరేషన్, సద్ గృహ సంస్థలో ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. రిలేషన్‌షిప్ ఆఫీసర్, బిజినెజ్ ప్రామోటర్స్, మార్కెటింగ్ మేనేజర్స్ తదితర ఉద్యోగాలకు మౌఖిక పరీక్ష జరుగుతుందన్నారు. పది, ఇంటర్ పూర్తిచేసిన యువత మేళాలో పాల్గొనవచ్చును. అభ్యర్థులు ముందుగా తమ వివరాలను నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగులు ఈ నెల 25న ఉదయం 10 గంటలకు హాజరుకావాలని శ్యామ్ సుందర్ కోరారు.

ఐటీఐల్లో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐల్లో నాలుగో విడతలో మిగిలిన సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తులను ఈ నెల 26లోగా పంపాలని కోరారు. ప్రభుత్వ ఐటీఐల్లో మిగులు సీట్లకు ఈ నెల 28న, ప్రైవేటు ఐటీఐల్లో సీట్లుకు 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

వచ్చే నెల 21 నుంచి నీటి సంఘాల ఎన్నికలు

- జిల్లాలో 29 నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు
- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో 29 నీటి సంఘాలకు వచ్చే నెల 21 నుంచి 23 వరకు ఎన్నికలు నిర్వహిస్తామని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి సోమవారం షెడ్యూల్ విడుదల చేశామన్నారు. జిల్లాలో గంభీరం రిజర్వాయర్‌తోపాటు మరో నాలుగు ఓపెన్‌హెడ్ ఛానళ్లు, 24 చెరువుల కింద సాగు భూమి ఉందన్నారు. వచ్చే నెల ఆరో తేదీన సాగునీటి సంఘాల వారీగా ఓటర్ల జాబితా విడుదల చేస్తామని, దీనిపై 11వ తేదీ నుంచి అభ్యంతరాలు స్వీకరించి వాటిని పరిశీలించి 13న తుది జాబితా విడుదల చేస్తామన్నారు. వచ్చే నెల 21వ తేదీ నుంచి 23 వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఓటర్ల జాబితాలు తయారుచేసే బాధ్యత తహసీల్దార్లకు అప్పగించామన్నారు. విలేకరుల సమావేశంలో ఎన్నికల నోడల్ అధికారి, విశాఖ జల వనరుల శాఖ డీఈ జె.స్వామినాయుడు పాల్గొన్నారు.

వాన నీటిని ఒడిసిపట్టడంతో జాతీయ అవార్డు సొంతం

నేడు ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జలశక్తి అవార్డు స్వీకరించనున్న తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు


తిరుమల నగర్‌లో ఇంకుడు గుంతలో చేరిన వర్షపు నీరు

కూర్మన్నపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు పరిధి తిరుమల నగర్‌లో నీటి కొరతను అధిగమించేందుకు గ్రేటర్ అధికారుల సూచనలు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల సహకారంతో పలు పార్కుల్లో తవ్విన ఇంకుడు గుంతల్లో పెద్దఎత్తున వర్షపు నీరు చేరింది. భూగర్భ జలాలు పెరిగి ఇంకుడు గుంతల్లోకి నీరు రావడంతో తమ ప్రయత్నం సఫలీకృతమైందని కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని రహదారుల పక్కన కూడ ఇంకుడు గుంతల తవ్వడం వల్ల నీటి ఎద్దడి నుంచి కాలనీవాసులు బయట పడ్డారు. ఇలా వాన నీటిని ఒడిసిపట్టడం ద్వారా ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన తిరుమల నగర్ కాలనీ ప్రతినిధులు మంగళవారం ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

నీటి కొరత నేర్పిన పాఠంతో..

కాలనీలో నీటి కొరత 2019లో తీవ్ర రూపం దాల్చింది. భూగర్భ జలాలు అడుగంటి బోరు బావుల నుంచి చుక్కనీరు కూడా రాకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో జీవీఎంసీ, ప్రైవేటు ట్యాంకుల ద్వారా నీటిని తెప్పించుకుని వినియోగించుకునేవారు. అప్పట్లో జీవీఎంసీ అధికారుల సూచన మేరకు కాలనీలో పలుచోట్ల ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం వల్ల భూగర్భ జలాలు పెరిగాయని సంఘం ప్రతినిధులు తెలిపారు. దీంతో బోరు బావుల నుంచి తమకు పుష్కలంగా నీరు వస్తుండడంతో తమ ఇబ్బందులు తీరాయన్నారు. దీంతో ప్రతిఒక్కరూ తమ ఇళ్ల ముందు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో తిరుమల నగర్ కాలనీలోని సుమారు పలు ఇళ్లల వద్ద సుమారు వంద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా 16 లక్షల లీటర్ల నీటిని ఆదా చేశారు. అలాగే కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు రహదారులు పక్కన 42, పార్కుల్లో 20 ఇంకుడు గుంతలను తవ్వించి 30.97 లక్షల లీటర్ల వర్షపు నీటిని ఆదా చేశారు. అంతేకాక పర్యావరణ పరిరక్షణ కోసం సుమారు నాలుగు వేల మొక్కలను నాటారు.

కేంద్ర జలశక్తి అవార్డు నేడు స్వీకరణ

కేంద్ర ప్రభుత్వం ఏటా ఇచ్చే జలశక్తి అవార్డుల్లో భాగంగా 2023 సంవత్సరానికి గాను తిరుమల నగర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు మూడో ర్యాంక్ దక్కింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు అవార్డు అందుకోనున్నారు. కాగా 2020లో కేంద్ర జలవనరుల శాఖ నుంచి వాటర్ హీరో అవార్డును కాలనీ ప్రతినిధి కె.పరమానందం సొంతం చేసుకున్నారు. ఇప్పటికే తిరుమల నగర్ కాలనీ పలు విభాగాల్లో 23 అవార్డులను కైవసం చేసుకోవడం గమనార్హం. ఇందులో జాతీయ స్థాయి అవార్డులు ఐదు, రాష్ట్ర స్థాయిలో రెండు, జోనల్, జిల్లా స్థాయిలో 16 అవార్డులను అందుకుంది.



పార్కులో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత



విద్యార్థినులతో హెచ్‌ఎం కాంతం, తదితరులు

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థినుల ఎంపిక

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థినులు బి.హేమలత, ఆర్.డిల్లీశ్వరిలు ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో వారిని హెచ్‌ఎం ఎంఎల్ కాంతంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు మహ్మద్ ఇస్మాయిల్, స్కూల్ కమిటీ సభ్యులు సంధ్రాన నూకరాజు, బొడ్డు రమణ, తదితరులు అభినందించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. నవంబరు నెలలో చిత్తూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొననున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

అగనంపూడి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. పాత అగనంపూడి, కుమ్మరి వీధిల్లో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట నాయకులు ఎం.వెంకటరావు, ఎస్. సింహాచలం, తదితరులు ఉన్నారు.

సినిమా గైడ్

- **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)
- **విశ్వం :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీ నరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **శ్వాగ్ :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 47, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 30, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 42, బీరకాయలు 34, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజ్ 34, క్యారేట్ 60 దొండకాయలు 30, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 100, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోసకాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 150, పొటల్స్ 62, కీర దోస 30, క్యాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	115
ఫారం ధర	135
విత్ స్కిన్	234
స్కిన్‌లెస్	250

వేళాపాళా లేకుండా తాగునీటి సరఫరా

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఎప్పుడు కొళాయిలు వస్తాయో తెలియని పరిస్థితి
- సిబ్బందిని అడిగితే దురుసుగా బదులిస్తున్నారని ఆవేదన



గాజువాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేళాపాళా లేని తాగునీటి సరఫరాతో పారిశ్రామిక ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాజువాక జోనల్ పరిధిలోని అధిక శాతం మంది ప్రజలు జీవీఎంసీ సరఫరా చేసే తాగునీటి పైనే ఆధారపడతారు. అయితే కొళాయిల ద్వారా నీరు ఎప్పుడు వస్తుందో ఎవరికి తెలియని పరిస్థితి నెలకొంది. రోజుకొక సమయంలో తాగునీటి సరఫరా చేయడం, అదికూడా ప్రతిరోజు ఇవ్వకపోవడంతో నీటి కోసం నానాపాట్లు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. తాగునీటి సరఫరాలో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే దురుసుగా బదులిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిని పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గాజువాక పరిసరాల్లో ఎక్కువ మంది రోజువారి కూలీలు నివసిస్తున్నారు. దీంతో కొళాయిల ద్వారా తాగునీరు ఏ సమయంలో వస్తుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో పనులకు వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో ఓ వీధిలో పది కుటుంబాలకు సంబంధించి రోజుకొకరు పనికి వెళ్లకుండా తాగునీటిని పట్టుకునేందుకు ఇంటి వద్ద ఉండేలా ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఇదిలావుండగా చాలా వార్డుల్లోని ఇళ్లకు పైపు లైన్ల లీకేజీ వల్ల తాగునీరు సక్రమంగా రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీల మూలంగా తాగునీరు వృథాగా పోతున్న విషయాన్ని సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే వినతుల్లో తాగునీటి సమస్యలకు సంబంధించినవే అధికంగా ఉంటాయి. అలాగే జీవీఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్ ఆయా వార్డుల్లో పర్యటించినప్పుడు కూడా తాగునీటి ఇబ్బందులనే స్థానికులు ప్రధానంగా వారి దృష్టికి తీసుకువెళుతున్నా సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. కొన్నిచోట్ల ప్రజలు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతుంటే.. మరికొన్నిచోట్ల రోజుల తరబడి నీరు వృథాగా పారుతుందని విచారం వ్యక్తం చేస్తున్నారు.

కాగా తాగునీటిని నిత్యం ఒకే సమయానికి సరఫరా చేయాలని సిబ్బందిని అడిగితే, తమకు నచ్చినప్పుడు చేస్తామంటూ చాలా దురుసుగా సమాధానం చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై జోనల్ నీటి సరఫరా విభాగం అధికారులను సంప్రదించినప్పటికీ వారు స్పందించడం లేదని పేర్కొంటున్నారు. అందువల్ల ఉన్నతాధికారులు స్పందించి తాగునీటిని సక్రమంగా సరఫరా చేసేలా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పెందుర్తి రైతుబజారుకు హంగులు

- డిజిటల్ డిస్‌ప్లేలో కూరగాయల ధరలు
- స్టాల్స్‌ను ఆధునికీకరించిన అధికారులు
- సమస్యల తలెత్తకుండా సీసీ కెమెరాలతో పర్యవేక్షణ


పెందుర్తి రైతుబజారు

పెందుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి రైతుబజారు ఆధునికత సంతరించుకుని హైటెక్ హంగులతో వినియోగదారులకు సేవలందిస్తోంది. ఈ రైతుబజారుకు ప్రతిరోజు సుమారు మూడు వేల మంది కొనుగోలుదారులు వస్తుంటారు. రోజుకి 90 స్టాల్స్‌లో 250 క్వింటాళ్ల కూరగాయలు విక్రయాలు జరుగుతున్నాయి. 11 మండలాల పరిధిలోని 51 గ్రామాలకు చెందిన 153 మంది రైతులు రైతుబజారులో స్టాల్స్ నిర్వహిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత గల రైతుబజారు గతంలో వసతులు, సౌకర్యాల లేమితో కొట్టమిట్టాడుతుండేది. తాజాగా ఆధునికీకరణ పనులు చేపట్టడంతో హైటెక్ హంగులు సంతరించుకుంది.ప్రాంగణంలోని అన్ని స్టాల్స్‌ను ఆధునికీకరించారు. కూరగాయాల ధరలు వివరాలు తెలిపే డిజిటల్ డిస్‌ప్లే బోర్డు ఏర్పాటుచేశారు. ఎలక్ట్రానిక్ తూకం ద్వారా విక్రయాలు జరిగాలే చర్యలు తీసుకున్నారు. కూరగాయల ధరలు, వినియోగదారుల సంక్షేమం, రైతుల నియమావళిపై ఎప్పటికప్పుడు మైక్‌లో అనౌన్సమెంట్ చేస్తూ సమీక్షిస్తున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాల్లో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. గిరిజన ప్రాంత రైతులకు వసతి సౌకర్యం కల్పించారు. రైతులకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు వీలుగా సుజల ఆర్వోప్లాంట్ ఏర్పాటుచేశారు. అసౌకర్యం కలిగేతే ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక బాక్స్‌ను ఉంచారు.


సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ

వాహనాల పార్కింగ్‌కు తప్పని ఇబ్బందులు

రైతుబజారులో వసతులు కల్పించిన అధికారులు విస్తరణ చేపట్టే అవకాశం లేకపోవడంతో వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో రహదారిపై వాహనాలను నిలిపివేయాల్సి రావడంతో అవస్థలు ఎదురవుతున్నాయి. దీంతోపాటు రైతుబజారులోకి పశువులు ప్రవేశించడం ఇబ్బందికరంగా పరిణమిస్తోంది. దీనిపై అధికారులు చర్యలు చేపటాల్సి ఉంది.

వినియోగదారులకు చేరువయ్యేలా



వినియోగదారులు రైతుబజారుకు చేరువయ్యేలా వసతులు కల్పించడంతో పాటు సేవలు విస్తృత పరిచాం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నాం. రైతులు, వినియోగదారుల సమన్వయం కోసం నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. దళారీ వ్యవస్థ లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాం. పార్కింగ్ సమస్య పరిష్కరించేందుకు ఉన్నతాధికారులకు నివేదించాం.

- వీఎస్వీ షర్మిల, ఎస్టేట్ అధికారి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే


బాధిత కుటుంబాలకు చెక్కులు అందిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

ఎన్‌ఏడీ జంక్షన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డుకు చెందిన అనారోగ్య బాధితులు ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సోమవారం తన కార్యాలయంలో అందజేశారు. శాంతినగర్‌కు చెందిన నిస్సి జాస్మీన్ ఆస్పత్రి ఖర్చుల కింద రూ.73100, గణేష్‌నగర్‌కు చెందిన మైసాల రామలక్ష్మికి రూ.23,920 చెక్కు అందజేశారు. గత ప్రభుత్వంలో ఇబ్బందులు ఎదురయ్యేవని, ప్రస్తుతం ఎప్పటికప్పుడు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే గణబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.వాసుదేవరావు, వైటీఆర్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ లోపల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరుతూ బీఎంఎస్ ప్లాంట్ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాస్ కోరారు. ఉక్కు కర్మాగారంలోని బీఎఫ్ విభాగం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని, ఈ క్రమంలో అక్కడ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదన్నారు. దీనిపై యాజమాన్యం సానుకూలంగా చర్యలు చేపడితే ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

సమయపాలన పాటించని మద్యం దుకాణాలు

- ఉదయం 8 గంటలకే తెరుస్తున్న యజమానులు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు



ఉదయం 9 గంటలకే తెరిచిన మద్యం దుకాణం, ఫుట్‌పాత్‌పై మందుబాబులు

మల్కాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు తెల్లవారేసరికి తెరచకుంటున్నాయి. ఫలితంగా ఆయా ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో ఉదయం ఎనిమిది గంటలకే మద్యం దుకాణాలు తెరచుకుంటున్నాయి. మందుబాబులు రోడ్ల మీదే మద్యం సేవిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఐదు మద్యం దుకాణలను ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ నిబంధలన ప్రకారం ఉదయం 10 గంటలకు దుకాణాలు తెరవాలి, రాత్రి 10 గంటలకు మూసేయాలి, కానీ ఉదయం 8 గంటలకే దుకాణాలను తెరిచి రాత్రి 11 గంటల వరకు విక్రయాలు చేపడుతున్నారు. దీంతో తెల్లవారేసరి మద్యం మత్తులో మందుబాబులు రహదారులపై చిందేస్తున్నారు. ఫుట్‌పాత్‌లకు ఆనుకుని మద్యం దుకాణాలు ప్రారంభించడంతో పాదచారులు రహదారులపై నడవాల్సి వస్తోంది. శ్రీహరిపురంలో ఓ వ్యాపారి కోరమాండల్ మద్యం దుకాణం అని పేరు పెట్టడం సర్వత్రా చర్చనీయాంశమయింది. ప్రముఖ కంపెనీ పేరును ఇలా మద్యం దుకాణానికి పెట్టడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సత్యం, ధర్మాన్ని ప్రజలందరూ పాటించాలి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు


సత్యసాయి మండళ్ల ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

గాజువాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రజలందరూ సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ వంటి వాటిని పాటించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. భగవాన్ సత్యసాయిబాబా అవతార ప్రకటన సందర్భంగా సోమవారం గాజువాక సమితిలో గల ఐదు భజన మండళ్ల ఆధ్వర్యంలో విశ్వ శాంతిని కాంక్షిస్తూ గొంతినవానిపాలెం సత్యసాయి మందిరం నుంచి గాజువాక వరకు మహా నగర సంకీర్తనను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పల్లా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మంచి కోసం పోరాడాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భజన మండళ్ల ప్రతినిధులు శంకర్ సాయిరాం, రాధ, భాస్కరరావు,ఎస్.ఆదిరెడ్డి, ఉమాశంకర్, సూర్యప్రకాశ్, నూకరాజు, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' కోసం అమృతరావు పోరాటం మరువలేనిది

మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య


అమృతరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చింతలపూడి, కార్మిక నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం తన ప్రాణాన్నే పణంగా పెట్టి పోరాడిన మహనీయుడు టి.అమృతరావు అని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య అన్నారు. అమృతరావు జయంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 21 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఉక్కు కర్మాగారాన్ని సాధించడంలో అమృతరావు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో అమృతావు మనవుడు టి.మోహన్‌గాంధీ, వివిధ సంఘాల కార్మిక నేతలు ఏవీ రమణారావు, డి.ఆదినారాయణ, కేవీడీ ప్రసాద్, జెర్రిపోతుల మోహన్, విళ్లా రామ్మోహన్‌కుమార్, బయ్యే మల్లయ్య, కొమ్మినేని శ్రీనివాసరావు, పరంధామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకకు 16 వినతులు

గాజువాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 16 వినతులు వచ్చాయి. పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని, వీధి లైట్లు వెలిగేలా చూడాలని, ప్రధాన రహదారుల్లో గోతులను పూడ్చాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. అలాగే పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు అధికారులను కోరారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని జెడ్సీ ఆదేశించారు.

వేపగుంట జోన్‌లో నాలుగు..

వేపగుంట: వేపగుంట జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు వినతులు అందాయి. కొత్తపాలెం నుంచి నరవ రహదారిలో చర్చి వద్ద రోడ్డు ఆక్రమణపై చర్యలు చేపట్టాలని, సుజాతనగర్ రోడ్డు వైండనింగ్‌లో కోల్పోయిన స్థలానికి టీడీఆర్ ఇప్పించాలని, అడవివరంలో బోరు మరమ్మతులు చేపట్టాలని, రోడ్డు విస్తరణలో భూమి కోల్పోయిన వారికి టీడీఆర్ ఇప్పించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని జెడ్సీ హైమావతి తెలిపారు.

గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

పెదగంట్యాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం సోమవారం నెల్లిముక్కు కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. పలువురు రోగులకు బీపీ, షుగర్, తదితర టెస్టులు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి పి.సోమునాయుడు, స్టీల్‌ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీముసిరి శ్రీనివాసరావు, టీడీపీ మండల నాయకుడు ములకలపిల్లి పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల సొమ్మును వారి ఖాతాలకు బదిలీ చేయాలి'

మల్కాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రైవేటు పారిశుధ్య కార్మికుల వేతనం నుంచి తగ్గించిన రెండు శాతం సొమ్మును కార్మికుల బ్యాంకు ఖాతాలకు బదిలీచేయాలని సీఐటీయూ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి కోరారు. శ్రీహరిపురంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. 2018 నుంచి 2020 వరకు కార్మికుల వేతనాల నుంచి రెండు శాతం ఆదాయ పన్ను నిమిత్తం తగ్గించారని, దానిని తిరిగివ్వాలని కోరడంతో జీవీఎంసీ ఎస్‌ఎల్‌ఎఫ్ గ్రూప్‌లకు చెక్కులను అందజేశారని, అవి సంస్థ వద్ద ఉండిపోయాయన్నారు. ఆ సొమ్ము కార్మికులకు చెల్లించాలని మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నామన్నారు. కార్యక్రమంలో జోన్ అధ్యక్షులు కె.రమణ, కమిటీ సభ్యులు రాంబాబు, డి.రాము, సూరిబాబు, కుమార్, కృష్ణ, రైలుబాబు, ఆదినారాయణ, తిరపతిరావు, గంగులు, లక్ష్మి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

ఏపీడీగా చిరంజీవిరావు బాధ్యతల స్వీకరణ


చిరంజీవిరావుకు మొక్కను ఇస్తున్న డ్వాక్రా మహిళలు

వేపగుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేపగుంట జోనల్ కార్యాలయం పరిధిలోని 89 నుంచి 98 వార్డుల ఇన్‌చార్జి ఏపీడీగా టి.చిరంజీవిరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సీఓలు, ఆర్.పీలు, డ్వాక్రా సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవిరావు మాట్లాడుతూ టిడ్కో గృహాలు ఎలాట్‌మెంట్ కాని వారికి వారు కట్టిన డిపాజిట్లు తిరిగి ఇచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. డ్వాక్రా గ్రూపుల్లో శానిటరీ కార్మికుల కుటుంబసభ్యులను చేర్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ పనిచేసిన శ్రీరామ్ బదిలీపై మధురవాడకు వెళ్లారు.

మర్రిపాలెం రైతుబజారులో స్వచ్ఛ భారత్


మొక్కలను తొలగిస్తున్న రైతులు

ఎన్‌ఏడీ జంక్షన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మర్రిపాలెం రైతు బజారులో సోమవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. రైతులు, స్టాల్స్ సిబ్బంది బజారులో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. బజారు వెనుక ఉన్న పిచ్చి మొక్కలను ఏరిపారేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు వివరించారు. ఈఓ వరహాలరావు, సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడిని తాకిన ఆదిత్య కిరణాలు


కృష్ణుని విగ్రహంపై సూర్యకిరణాలు

పెందుర్తిరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలగ్రహారం శ్రీకృష్ణాలయంలో సోమవారం కృష్ణుని విగ్రహంపైకి సూర్యకిరణాలు ప్రసరించాయి. ధ్వజస్తంభం నుంచి నుంచి నేరుగా మూలవిరాట్టు పాదాలపై కిరణాలు పడడంతో భక్తులు పారవశ్యం చెందారు. ప్రత్యేక పూజలు చేశారు.

అవయవ దాతల సంఘం కన్వీనర్‌గా శ్రీను


ఉత్తర్వులు అందుకుంటున్న శ్రీను

పెందుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీనును శరీర అవయ దాతల సంఘ పెందుర్తి జోన్ కన్వీనర్‌గా నియమించారు. ఈ మేరకు సావిత్రీబాయి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గూడురు సీతామహాలక్ష్మి ఉత్తర్వులు అందజేశారు.

దుర్గాదేవి అమ్మవారికి సారె

సీతమ్మధార, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెం క్రేజీ ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళలంతా కలిసి అమ్మవారికి సారె ప్రసాదాన్ని సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో సారె ఊరేగించి, ఏడుగుళ్ల ఆలయం, అభయ దురాలమ్మ ఆలయంలో అమ్మవారికి, నక్కవానిపాలెం నూకాలమ్మ అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లకు నివేదన చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు ధర్మాల గురుమూర్తి రెడ్డి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీడీల బాధ్యతల స్వీకరణ

జ్ఞానాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జోన్-5 కార్యాలయంలో 23 వార్డులకు సంబంధించి ఇద్దరు ఏపీడీలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జోనల్ కమిషనర్ బి.రాము నుంచి ఉత్తరంలో పూర్తిగా, దక్షిణంలో ఒక వార్డుకు పుణ్యవతి, పశ్చిమ నియోజకవర్గంలోని వార్డులకు కృపానందం నియమితులయ్యారు. వీరు ఇంతవరకు జోన్-4 కార్యాలయంలో పనిచేసేవారు.

కాలుష్యం కోరల్లో వన్‌టౌన్

» పోర్టులో భారీగా బొగ్గు, బాక్సైట్ నిల్వలు
» నివాసిత ప్రాంత పరిసరాలు మసి

(ఆంధ్రజ్యోతి-జగదాంబ కూడలి)

విశాఖ వన్‌టౌన్ పరిసరాలను పోర్టు కాలుష్యం కమ్మేస్తోంది. కొండలను తలపించే మాదిరి బొగ్గు, బాక్సైట్ నిల్వలు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. ఎండ తీవ్రతతో పోర్టు నుంచి వెదజల్లే బొగ్గు కాలుష్యం ఈ ప్రాంతీయులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కాలుష్య నియంత్రణపై పోర్టు అథారిటీ సరైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బొగ్గు, గంధకం నిల్వలపై టార్పాలిన్లు కప్పకపోవడం వల్ల దుమ్ము, ధూళి గాలిలో ఎగసి పడుతుందని వన్‌టౌన్ పరిసర ప్రాంత ప్రజానీకం అసహనం వ్యక్తంచేస్తోంది. పోర్టు ట్రస్ట్ బొగ్గు నిల్వలతో వన్‌టౌన్ కోటవీధి నుంచి లక్ష్మీటాకీస్, పూర్ణామార్కెట్, కాన్వెంట్ జంక్షన్, జగదాంబ నుంచి దొండపర్తి పరిసర ప్రాంతాల్లో మసి పేరుకుపోతోందని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేకమంది అనారోగ్యంపాలవుతున్నారని



వాహనాల రాకపోకలతో వెదజల్లుతున్న దుమ్ము, ధూళి

చెబుతున్నారు. పోర్టు యాజమాన్యం కాలుష్య నియంత్రణ పట్ల సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఎగరకుండా నీళ్లు చిమ్మరించాల్సి ఉన్నా, బేఖాతరు చేస్తున్నారు. బొగ్గు నిల్వల పరిసరాల వద్ద నుంచి ఎగుమతి, దిగుమతులు నిరంతరం కొనసాగుతాయి. యాజమాన్యం కాలుష్య నియంత్రణను పక్కన పెట్టిందని మైనారిటీ నాయకుడు గఫూర్ ఆరోపించారు. బొగ్గు నిల్వల వల్ల కొద్దిరోజులుగా ఇక్కడ ప్రజానీకం తీవ్ర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఈ సమస్యపై చర్యలు తీసుకోలేదని, కూటమి ప్రభుత్వం తక్షణమే కాలుష్యం బారి నుంచి వన్‌టౌన్ పరిసర ప్రాంత ప్రజానీకాన్ని కాపాడాలని కోరుతున్నారు.



వన్‌టౌన్ పోర్టు ఏరియాలో భారీగా బొగ్గు, బాక్సైట్ నిల్వలు

కేజీహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

» పల్మనరీ ఆర్టెరీలో గడ్డ కట్టిన రక్తాన్ని తొలగించి యువకుడి ప్రాణాలు కాపాడిన వైద్యులు



విజయవంతంగా శస్త్రచికిత్స చేసిన వైద్యబృందంతో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లోని కార్డియో థొరాసిక్ వాస్కులర్ సర్జరీ విభాగంలో అరుదైన శస్త్ర చికిత్సను వైద్యుల బృందం విజయవంతంగా పూర్తిచేసింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమండ్రికి చెందిన హరికృష్ణ (34) కొద్ది నెలలుగా తీవ్రమైన దగ్గుతో ఇబ్బందిపడుతున్నాడు. ఆరు నెలల నుంచి దగ్గుతోపాటు రక్తం పడుతోంది. అనేక మంది వైద్యులకు చూపించినా ప్రయోజనం లేకుండా పోయింది. హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు వరకు ఖర్చవుతుందని చెప్పారు. అంత మొత్తం వెచ్చించే స్థోమత లేక ఈ నెల పదో తేదీన కేజీహెచ్‌లో చేరాడు. అదేరోజు మెడికల్ వార్డు నుంచి కార్డియో థొరాసిక్ విభాగానికి వైద్యులు రిఫర్ చేశారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు థ్రాంబోస్‌గా నిర్ధారించారు. అంటే, గుండె నుంచి ఊపిరితిత్తులకు చెడు రక్తాన్ని తీసుకువెళ్లే పల్మనరీ ఆర్టెరీలో రక్తం గడ్డ కట్టడం. ఆ గడ్డను తొలగించేందుకు వైద్యులు సర్జరీకి సిద్ధమయ్యారు. శస్త్ర చికిత్స వల్ల ఒక్కోసారి రోగి ప్రాణానికి ప్రమాదం ఉంటుందన్న విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారి అనుమతితో ఈనెల 11న సుమారు నాలుగు గంటలపాటు శస్త్ర చికిత్స నిర్వహించి పల్మనరీ ఆర్టెరీలో గూడు కట్టిన గడ్డను తొలగించారు. ఈ ప్రక్రియను వైద్య పరిభాషలో పల్మనరీ థ్రాంబో ఎంబోలెక్టమీ లేదా పల్మనరీ థ్రాంబెక్టమీ అంటారు. లంగ్స్ వరకు రక్తం గడ్డ కట్టినట్టు గుర్తించిన వైద్యులు మొత్తాన్ని తొలగించారు. రోగి ప్రస్తుతం కోలుకున్నాడు.

వైద్యబృందానికి అభినందన

శస్త్రచికిత్స నిర్వహించిన వైద్య బృందాన్ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద అభినందించారు. ఈ శస్త్ర చికిత్సను కార్డియోథొరాసిక్ విభాగానికి చెందిన వైద్యుల బృందం డాక్టర్ కె.మణిత, డాక్టర్ ఎ.పద్మజ, అనస్థీషియా వైద్యులు సతీష్, రమేష్, భవానీ నిర్వహించారు. ఈ తరహా కేసులను రాష్ట్రంలో ఎక్కడా చేయలేదని, దాదాపు 90 శాతం కేసుల్లో ప్రాణానికి ప్రమాదం ఉంటుందని, విజయవంతంగా శస్త్ర చికిత్సను పూర్తిచేయడం ఆనందంగా ఉందని డాక్టర్ పద్మజ తెలిపారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

» వినతుల స్వీకరణ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సూచన

జ్ఞానాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ బి.రాము సూచించారు. సోమవారం జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 5 వినతులను స్వీకరించారు. పట్టణప్రణాళికా విభాగానికి సంబంధించి 1, ప్రజారోగ్యానికి సంబంధించి 4 అర్జీలు అందాయి. సూపరింటెండెంట్ టి.ఎస్.ఎన్.రాజు, ఏసీపీ వెంకట్రావు, ఏఎంహెచ్ఓ సునీల్ కుమార్, ఆర్.ఓలు బాబురావు, రాజ్యలక్ష్మి, ఏపీడీలు పుణ్యవతి, కృపానందం తదితరులు పాల్గొన్నారు.



జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న జడ్సీ రాము

అధికారులు అందుబాటులో ఉండాలి

తుపాన్ ప్రభావం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా అందుబాటులో ఉండాలని జోన్-5 కమిషనర్ బి.రాము ఆదేశించారు. సోమవారం వార్డుల ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పూడికలు తీసేందుకు వీలుగా తగిన సరంజామాను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ముంపు, కొండ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పాత భవనాలను గుర్తించి తక్షణమే నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు.

అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో...

సీతమ్మధార, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ ఎం.రమేష్ అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తనకు ఎవరూ లేరని, ఎటువంటి ఆదాయం లేదని పేర్కొంటూ ఒక మహిళ దరఖాస్తు చేసుకుంది. సంబంధిత సిబ్బందితో విచారణ జరిపించి తక్షణమే ధ్రువపత్రాన్ని అందచేశారు. విద్యార్థులకు కావలసిన ధ్రువపత్రాలను పరిశీలించి త్వరితగతిన జారీ చేయించాలని సిబ్బందికి సూచించారు.

'రైల్వే వ్యవస్థ పరిరక్షణే ధ్యేయం కావాలి'



స్మారక స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచుతూ అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ దుబే

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైల్వే వ్యవస్థను పరిరక్షించడం, ప్రజలకు అంకితభావంతో సేవలందించడమే రైల్వే రక్షణ దళం ప్రధాన కర్తవ్యమని వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ దుబే పేర్కొన్నారు. వాల్తేరు రైల్వే ప్రధాన కార్యాలయంలోని ఆర్పీఎఫ్ బ్యారక్‌లో సోమవారం నిర్వహించిన ఆర్పీఎఫ్ సంస్మరణ దినోత్సవంలో ఆయన పాల్గొని వీరమరణం చెందిన అమరవీరులకు షాహిద్ స్మారక్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ భద్రతకు విధుల నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన సైనికుల జ్ఞాపకార్థం సంస్మరణ దినోత్సవం నిర్వహించుకోవడం గౌరవ స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. అమరవీరుల స్ఫూర్తితో లక్ష్యం, దృఢనిశ్చయంతో విధుల నిర్వహణలో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైకిలింగ్, సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంట్రీలు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి అండర్-14, 17 బాలురు, బాలికల సైకిలింగ్, సాఫ్ట్ టెన్నిస్, మల్లఖంబ క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేవుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడాంశాలలో పాల్గొనేందుకు ఆసక్తి చూపే వారు ఫోన్:9951681784 నందు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సంబంధిత పీఈటీ ద్వారా తెలియజేయవచ్చని పేర్కొన్నారు.



పాముకు వైద్య సేవలు అందజేస్తున్న పశు వైద్యాధికారిణి లావణ్య

నాగుపాముకు వైద్యం

అగనంపూడి (విశాఖపట్నం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముంగిస దాడిలో గాయపడిన నాగుపాముకు సోమవారం నగర పరిధిలోని అగనంపూడి పశువుల ఆస్పత్రిలో వైద్యురాలు చికిత్స అందించారు. వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి బీసీ కాలనీలోని ఓ ఇంటి ముందు నాగుపాము, ముంగిస తలపడ్డాయి. స్థానికులు భయంతో ఈ విషయాన్ని స్నేక్ క్యాచర్ అయిన కిరణ్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. అతను అక్కడకు చేరుకుని అప్పటికే గాయపడిన నాగుపామును పట్టుకొని స్థానిక పశు వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్కడ వైద్యాధికారిణి లావణ్య పాముకు చికిత్స అందజేశారు. నాగుపాముకు మంగళవారం మరొకసారి వైద్యం చేయించి కొండ ప్రాంతంలో విడిచి పెడతానని కిరణ్ తెలిపారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు గంటా పరామర్శ



విష్ణుకుమార్‌రాజుతో సంభాషిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సీతమ్మధార, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మోకాలి నొప్పితో బాధపడుతున్న ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు సీతమ్మధారలో విశ్రాంతి తీసుకుంటున్న విష్ణుకుమార్ రాజు ఇంటికి గంటా విచ్చేసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కొద్ది సేపు పలు అంశాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక తదితరులు పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

కంచరపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ సమీపంలో గల నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఉప ప్రాంతీయ ఉపాధి కల్పన అధికారి శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 25న యువతకు జాబ్‌మేళా చేపట్టనున్నట్టు తెలిపారు. ఇందులో ముత్తూట్ ఫిన్ కార్పొరేషన్, సద్ గృహ సంస్థలలో ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. రిలేషన్‌షిప్ ఆఫీసర్, బిజినెజ్ ప్రొమోటర్స్, మార్కెటింగ్ మేనేజర్స్ తదితర ఉద్యోగాలకు మౌఖిక పరీక్ష జరుగుతుందన్నారు. పది, ఇంటర్ పూర్తిచేసిన యువత మేళాలో పాల్గొనవచ్చును. అభ్యర్థులు ముందుగా తమ వివరాలను నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగులు ఈ నెల 25న ఉదయం 10 గంటలకు హాజరుకావాలని శ్యాం సుందర్ కోరారు.

ఐటీఐల్లో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐల్లో నాలుగో విడతలో మిగిలిన సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తులను ఈ నెల 26లోగా పంపాలని కోరారు. ఈలోగా సమీపంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో ధ్రువపత్రాలను పరిశీలన చేయించి రసీదు పొందాలన్నారు. గతంలో ధ్రువపత్రాల పరిశీలన పూర్తయితే ఇప్పుడు అవసరం లేదన్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో మిగులు సీట్లకు ఈ నెల 28న, ప్రైవేటు ఐటీఐల్లో సీట్లకు 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

16, 17 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

అల్లిపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా ఏఐఎస్ఎఫ్ 32వ మహాసభలు నవంబరు 16, 17 తేదీల్లో నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి యు.నాగరాజు తెలిపారు. సోమవారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులంతా మహాసభలకు హాజరవుతారన్నారు. జిల్లా సమితి సభ్యులు శివరాజ్‌కుమార్, శివరామ్‌రెడ్డి, సందీప్, కిరణ్, లవకుమార్,సూర్య, గణేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పోలియో వ్యాక్సిన్ తప్పక వేయించండి

మహారాణిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఇటీవల పోలియో కేసు బయటపడిన నేపథ్యంలో పోలియోమైలిటిస్ వల్ల కలిగే నిరంతర ముప్పును గుర్తించటం చాలా అవసరమని ప్రముఖ శిశు వైద్య నిపుణులు డాక్టర్ పి.సతీష్‌కుమార్ అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా జిల్లాపరిషత్ సమావేశమందిరంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదేళ్ల లోపు పిల్లలను పోలియో తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్నారు. ఇది కోలుకోలేని పక్షవాతం. కొన్ని సందర్భాల్లో మరణానికి దారితీస్తుందని తెలిపారు. పోలియో వినాశకర ప్రభావాల నుంచి రక్షించటానికి టీకా వ్యాక్సినేషన్ షెడ్యూల్‌ను పాటించాలని సూచించారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేయాలి



విద్యార్థులతో కలిసి కింద కూర్చొని భోజనం చేస్తున్న ఎంఈవో సోమేశ్వర్రావు

కంచరపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉన్నత భవితకు ఉపాధ్యాయులు కృషిచేయాలని గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి అంబటి సోమేశ్వర్రావు అన్నారు. జీవీఎంసీ 57వ వార్డు పరిధి ఆశవానిపాలెం ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలను పరిశీలించారు. కృత్యాధార బోధనను పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యత చూశారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు రోజూ హాజరయ్యేలా ఉపాధ్యాయులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. పాఠశాల ప్రాంగణంలో గల అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారుల హాజరు వివరాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు రవిరామ్, ఉపాధ్యాయులు బాలకృష్ణ, నూకరాజు పాల్గొన్నారు.

ఆరోగ్యకర ఆహార పోటీల్లో విజేతలకు బహుమతులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే గొప్పస్థాయికి చేరుతారని కంకటాల సీఎండీ కంకటాల మల్లికార్జునరావు, రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ప్రెసిడెంట్ ధర్మేందర్, యూత్ సర్వీసెస్ డైరెక్టర్లు ఆశా జాస్తి, కరుణ పేర్కొన్నారు. సోమవారం రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్, సన్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ చెఫ్ దినోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 8 నుంచి 12వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు 'ఆరోగ్యకరమైన ఆహారం' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. నగరానికి చెందిన వివిధ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఉత్సాహాన్ని ప్రదర్శించిన తీరు అద్భుతమన్నారు. చిన్న వయస్సులోనే వారిలో దాగి ఉన్న సృజనాత్మక కళను బయటకు తీశారన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా అదిరిట గోగి, అలోక్యనా, పి.హన్సిక గెలుపొందారు. పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులను అందజేశారు.



బహుమతులు అందుకున్న వద్యార్థినులతో అతిథులు

మాస్టర్ ప్లాన్ రోడ్డు ఆక్రమణ!

... 5వ పేజీ తరువాయి

నిర్మాణం సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలను కొంతమేర తొలగించారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించి, విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేశారు. రోడ్డును భారీగా విస్తరించడంతో షాపులకు డిమాండ్ పెరిగింది. దీంతో కొంతమంది రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీపై సిమెంట్ పలకలు వేసి, ర్యాంపులు నిర్మించి దుకాణాలు పెట్టేశారు. ఒకరైతే ఏకంగా నివాస భవనం నిర్మాణానికి జీవీఎంసీ నుంచి ప్లాన్ తీసుకుని ఏకంగా మూడంతస్తులు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేశారు. రోడ్డు ముందువైపు సెట్‌బ్యాక్, పార్కింగ్ కోసం సెల్లార్‌ను విడిచిపెట్టాల్సి ఉన్నప్పటికీ డ్రైనేజీ వరకూ భవనం నిర్మించేశారు. సెల్లార్‌లో కూడా ఐదు దుకాణాలు ఏర్పాటుచేయడమే కాకుండా డ్రైనేజీపై సిమెంట్ పలకలు వేసి కప్పేశారు. రోడ్డును ఆరు అడుగులు వరకూ ఆక్రమించేసి దుకాణాల ముందు రేకులు షెడ్లు ఏర్పాటుచేశారు. అక్కడ వినియోగదారులంతా కూర్చునేలా టేబుళ్లు, కుర్చీలను ఏర్పాటుచేశారు. ఆ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు వచ్చేవారంతా తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో మాస్టర్ ప్లాన్ రోడ్డులోని ఒక లైన్ వాహనాలతో నిండిపోవడంతో రెండో లైన్‌లోనే వాహనాల రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని సందర్భాల్లో అక్కడకు వచ్చేసరికి వాహన చోదకులు ఏమరుపాటుగా ఉంటే పక్కనే పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను తగులుతుండడంతో తరచూ గొడవలు అవుతున్నాయి. అక్రమ నిర్మాణాలు, రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎందుచేతనో అటువైపు కన్నెత్తి చూడడం లేదు. మరోవైపు కొత్తగా నిర్మించిన రోడ్డును ఆక్రమించినా, రోడ్డు అలైన్‌మెంట్‌ను దెబ్బతీసేలా వ్యవహరించినా వీఎంఆర్‌డీఏ అధికారులు సైతం పట్టించుకోకపోవడం ఆశ్చర్యపరుస్తోంది. ఇప్పటికైనా జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు మాస్టర్‌ప్లాన్ రోడ్డులో ఆక్రమణలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాలు

వీఎంఆర్‌డీఏలో దళారులకు చెక్

... 5వ పేజీ తరువాయి

కనిపిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దరఖాస్తుదారులు ఎవరైనా సరే వారి సమస్యలు చెప్పుకోవడానికి సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్యనే రావాలని సూచించారు. ఇదే విషయం స్పష్టం చేస్తూ ఆ సెక్షన్ బయట నోటీస్ పెట్టించారు. ఆ సమయంలో కాకుండా మధ్యలో ఎవరు వచ్చినా లోపలకు అనుమతించకుండా చూడడానికి ఒకరిని నియమించారు. ఎవరు వస్తున్నారో, ఎవరిని కలుస్తున్నారో తెలుసుకోవడానికి సీసీ టీవీ కెమెరాలతో పాటు ప్రత్యేకంగా ఒక పుస్తకం కూడా పెట్టించారు. ఈ చర్యల తరువాత దళారులు కొంతవరకు కనుమరుగయ్యారు. అయితే 'ఆఫీసులోకి రానివ్వకపోతే మా పనులు చేయించుకోలేమా?, ఎదురుగా రెస్టారెంట్‌లో కూర్చొని మాట్లాడుకుంటాం' అంటూ దళారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఒక్క విభాగాన్ని ట్రాక్‌లో పెడితే వీఎంఆర్‌డీఏకు చాలావరకు చెడ్డపేరు తగ్గిపోతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఎంత మేరకు ఫలితాలు వస్తాయో వేచి చూడాల్సిందే.

25న జిల్లా అభివృద్ధిపై ఇన్‌చార్జి మంత్రి సమీక్ష

... 5వ పేజీ తరువాయి

పరిపాలనాపరమైన అంశాలపై ఇన్‌చార్జి మంత్రి చర్చిస్తారన్నారు. అన్ని విభాగాల హెచ్‌వోడీలు తమ తమ శాఖల్లో చేపట్టిన పనులపై పూర్తిస్థాయి నివేదికలతో హాజరుకావాలన్నారు. అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. అదే రోజు ఉదయం ఆనందపురం మండలం 'సీ' కన్వెన్షన్ హాలులో భీమిలి నియోజకవర్గ సమీక్ష ఉంటుందన్నారు. కాగా ఈనెల 24వ తేదీన జరగనున్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి పక్కా నివేదికలతో అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. గతంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలపై చేపట్టిన చర్యలను వివరించాలన్నారు. సమావేశం నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు.

వచ్చే నెల 21 నుంచి నీటి సంఘాల ఎన్నికలు

» జిల్లాలో 29 నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు
» జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 29 నీటి సంఘాలకు వచ్చే నెల 21 నుంచి 23 వరకు ఎన్నికలు నిర్వహిస్తామని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి సోమవారం షెడ్యూల్ విడుదల చేశామన్నారు. జిల్లాలో గంభీరం రిజర్వాయర్‌తోపాటు మరో నాలుగు ఓపెన్‌హెడ్ ఛానళ్లు, 24 చెరువుల కింద సాగు భూమి ఉందన్నారు. వచ్చే నెల ఆరో తేదీన సాగునీటి సంఘాల వారీగా ఓటర్ల జాబితా విడుదల చేస్తామని, దీనిపై 11వ తేదీ నుంచి అభ్యంతరాలు స్వీకరించి వాటిని పరిశీలించి 13న తుది జాబితా విడుదల చేస్తామన్నారు. వచ్చే నెల 21వ తేదీ నుంచి 23 వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఓటర్ల జాబితాలు తయారుచేసే బాధ్యత తహసీల్దార్లకు అప్పగించామన్నారు. విలేకరుల సమావేశంలో ఎన్నికల నోడల్ అధికారి, విశాఖ జల వనరుల శాఖ డీఈ జె.స్వామినాయుడు పాల్గొన్నారు.

ఘనంగా శ్రేష్ఠ భారత్ ఉత్సవాలు



కేంద్రీయ విద్యాలయంలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

మర్రిపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మర్రిపాలెం 104 ఏరియా శ్రీవిజయనగర్ కాలనీ కేంద్రీయ విద్యాలయం-2లో కేంద్రీయ విద్యాలయ సంఘటన్, ఎన్‌సీఈఆర్‌టీల ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా, ఏక్ భారత్ శ్రేష్ఠ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్ఎస్‌టీఎల్ పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సీవీ నరసింహా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు రెండోసారి పాఠశాల వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. మూడురోజులు నిర్వహించే ఉత్సవాల్లో లలితకళల్లో నైపుణ్యం, బృందగానం, సామూహిక నృత్యం, వాద్యపరికరాల నైపుణ్యం, దృశ్యకళ, స్థానికంగా ప్రాచుర్యం పొందిన మట్టిబొమ్మల తయారీలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్ ప్రాంతీయ పరిధిలోని 72 పాఠశాలల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు బాలాజీ, రామ్‌భూపాల్, లక్ష్మీపాపాయి, రామచంద్రరావు పాల్గొన్నారు.



డీఐజీకి మొక్క ఇస్తున్న ఎస్పీ సిన్హా

డీఐజీని కలిసిన అనకాపల్లి జిల్లా ఎస్పీ

విశాలాక్షినగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథె జట్టిని ఆయన కార్యాలయంలో అనకాపల్లి ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తుహిన్ సిన్హా సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఐజీకి మొక్క అందించి, పలు అంశాలపై ఆయనతో చర్చించారు.

రేపటి నుంచి రీసర్వే భూములపై గ్రామ సభలు

ఆనందపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీసర్వే భూములపై జేసీ ఆదేశాల మేరకు బుధవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.23న కణమాం, 26న ఎన్‌జీఆర్‌పురం-1, 29న ఎన్‌జీఆర్ పురం-2, 30న పాలవలస, 1న చందక, 2న వేములవలస, 5న పెద్దిపాలెం, 6న వెల్లంకి, 7న కోలవానిపాలెం, 8న ముకుందపురం, 12న జీఎస్ అగ్రహారం, 13న తంగుడుబిల్లి, 14న గోరింట, 15న బిడిపాలెం, 16న గోరింట, 19న పందలపాక, 20న తర్లువాడ, 21న జగన్నాథపురం, 23న గంభీరం, 26న బాకురుపాలెం, 27న పేకేరు గ్రామాల్లో సభలు జరుగుతాయని చెప్పారు. సభల్లో భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

డిబేట్ పోటీల్లో చిట్టివలస బాలికల ప్రతిభ

తగరపువలస, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర సాధనలో విద్యార్థుల పాత్ర అన్న అంశంపై జిల్లాస్థాయిలో అధికారులు నిర్వహించిన డిబేట్ పోటీల్లో చిట్టివలస కేజీబీవీకి ద్వితీయ స్థానం లభించింది. ఈమేరకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సోమవారం తన కార్యాలయంలో బాలికలు పి. సుస్మిత, జీవీఎన్ ప్రీతికి బహుమతి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రోజామణి, వ్యాయామ ఉపాధ్యాయిని సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

పుట్ట గొడుగులకు డిమాండ్

భీమునిపట్నం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :మండలంలో అనేక ప్రాంతాల్లో పంట పొలాలు, చెట్ల మొదళ్లలలో పుట్ట గొడుగులు విపరీతంగా లభిస్తున్నాయి. వీటిని సేకరించిన వారు కూరగాయలతో పాటు అమ్మకాలు చేస్తున్నారు. ప్రస్తుతం కిలో రూ. 800 నుంచి రూ. 1000 వరకూ విక్రయిస్తున్నారు. గతంలో వీటిని కొంతమంది రైతులు సాగు చేసేవారు. అనేక ప్రాంతాల్లో విస్తారంగా లభిస్తుండడం వల్ల సాగు విస్తీర్ణం తగ్గింది.

సినిమా గైడ్

● **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)

● **విశ్వం :** మెలోడి, శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీ నరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాల పట్నం),మోహిని కాంప్లెక్స్ లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

● **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)

● **శ్వాగ్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

● **దేవర :** జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

● **సత్యం సుందరం :** శ్రీరామ

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 47, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 30, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 42, బీరకాయలు 34, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 34, క్యారెట్ 60 దొండకాయలు 30, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 100, బరబటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోసకాయ 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 150, పొటల్స్ 62, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	115
ఫారం ధర	135
విత్ స్కిన్	234
స్కిన్‌లెస్	250

ఫిర్యాదుల స్వీకరణలో అలసత్వం వద్దు

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, అక్టోబరు 21 : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అధికారులు మొక్కుబడిగా చేయరాదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం ఆయన భీమిలి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీక రించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆనందపురం, పద్మనాభం మండలాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒకటి, రెండు వినతులే అందుతున్నాయని అధికారులు చెబుతున్నారని, భీమిలిలో కూడా అదే వింటున్నానని చెప్పారు. ఈ విషయంలో అధికారులు ప్రజలకు తగిన నమ్మకాన్ని కలిగించలేకపోతున్నారని, ఎంతో వ్యయ ప్రయాసాలు పడి కలెక్టర్ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి వెళ్లి అర్జీలు ఇచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఈ పద్ధతిలో మార్పు రావలసి ఉందని తెలిపారు. మండల స్థాయిల్లో జరిగే పీజీఆర్ఎస్‌ను తూతూమంత్రంగా నిర్వహించకుండా బాధ్యతాయుతంగా చేపడితే ప్రజల్లో నమ్మకం వస్తుందని చెప్పారు. తాను పాల్గొన్నపుడు ఎంతోమంది అర్జీలు తీసుకువస్తున్నారని, మీరు నిర్వహించేటప్పుడు ఎందుకు రావడం లేదని ఆలోచించాలన్నారు. ఇకపై ప్రతి సోమవారం ఏదో ఒక మండల పీజీఆర్ఎస్‌లో పాల్గొంటానని, ముందుగా ఎక్కడ పాల్గొంటానో తెలియజేస్తానని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తుందన్నారు. అనంతరం ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సంగీత్ మాధుర్, టీడీపీ నాయకులు కోరాడ రాజబాబు, జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు, టీడీపీ మండల అధ్యక్షుడు దంతులూరి అప్పలనరసింహరాజు, కె. రామానాయుడు, తహసీల్దార్ రామారావు, జడ్పీ ప్రేమ ప్రసన్నవాణి, ఎంపీడీవో హనుమంతరావు, ఈవో ఆర్డీ రమేష్‌నాయుడు, గాడు అప్పలనాయుడు, పాల్గొన్నారు.



రమణ ముత్యాలమ్మ తల్లి ఆలయం సమీపంలో పేరుకుపోయిన చెత్త



కృష్ణాకాలనీలో పారిశుధ్యం దుస్థితి

భీమిలిలో పారిశుధ్య లోపం

భీమునిపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. వార్డుల్లో ఎక్కడ చూసినా.. చెత్త కుప్పలే కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రతి రోజూ చెత్త తరలించకపోవడంతో ఒకవైపు దోమల వ్యాప్తి, మరోవైపు దుర్వాసన వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకొన్నిచోట్ల తాగునీటి పైప్‌లైన్ల వద్ద కూడా చెత్త పెద్ద ఎత్తున నిల్వ ఉండడం ఆందోళన కలిగిస్తోంది. 3వ వార్డు పరిధిలోని వీధుల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. జోనల్ కార్యాలయం పరిధిలో తగినంత మంది పారిశుధ్య సిబ్బంది లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. విజయనగరం జిల్లా గుర్లలో అతిసార వచ్చి పలువురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో పట్టణంలో పారిశుధ్య లోపం, కలుషిత తాగునీరు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఓల్డ్ ప్రైవేట్ ఐటీఐ సమీపంలో ...



బంగారాన్ని బ్యాంక్ అధికారులకు అందజేస్తున్న ఈఓ త్రినాథరావు

గోల్డ్ బాండ్లకు అప్పన్న బంగారం అప్పగింత

సింహాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి మొక్కుబడిగా కానుకల రూపంలో ఆలయ హుండీల్లో సమర్పించిన స్వర్ణాభరణాలను బ్యాంక్‌లో గోల్డ్ బాండ్ల నిమిత్తం దేవదాయశాఖ అధికారులు అప్పగించారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వుల మేరకు నియమించిన కమిటీ సభ్యుల సమక్షంలో సోమవారం ఆలయ పద్మనిధిలోని స్వర్ణాభరణాలను బయటకు తీశారు. వాటిని బ్యాంకు అధికారులు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో తూనిక వేశారు. నాలుగు కిలోల 380 గ్రాముల స్వర్ణ ఆభరణాలను సీలు చేసి, ఈఓ వేండ్ర త్రినాథరావు బ్యాంక్ అధికారులకు అందజేశారు. ఇప్పటివరకు భక్తులు సమర్పించిన సుమారు 44 కిలోల స్వర్ణాన్ని బాండ్ల రూపంలో బ్యాంక్‌లో ఉంచగా వడ్డీ రూపంలో అప్పన్న ఖజానాకు ఏటా రూ.35 లక్షల ఆదాయం వస్తోంది. కార్యక్రమంలో దేవాదాయ శాఖ రీజినల్ సంయుక్త కమిషనర్ సుబ్బారావు, జ్యూవెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ పల్లమరాజు, ఏఈఓలు ఆనందకుమార్, రమణమూర్తి, దేవస్థానం గోల్డ్ స్మిత్ సాంబమూర్తి పాల్గొన్నారు.



గెడ్డలో ప్రవహిస్తున్న మురుగు నీరు

మురికి కూపంగా సుద్ద గెడ్డ

మధురవాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని సుద్ద గెడ్డ మురికి కూపంగా మారుతోంది. పదేళ్ల కిందట ఈ గెడ్డలో స్వచ్ఛమైన నీరు ప్రవహించేది. కాలక్రమంలో గెడ్డ పరిసర ప్రాంతంలో నివాసాలు ఏర్పడడంతో వాడుక నీరు కాలువల్లో కలవకుండా నేరుగా గెడ్డలోకి మళ్లించడంతో మురికి కూపంగా తయారవుతోంది. గతంలో ఈ గెడ్డపై వీఎంఆర్‌డీఏ ఎనిమిది చెక్ డ్యామ్‌లు నిర్మించింది. దీంతో నీరు నిల్వ ఉండడంతో సమీపంలోని మిథిలాపురి వుడాకాలనీ, దివ్యాంగుల కాలనీ, పాత మధురవాడ తదితర ప్రాంతాలకు స్వచ్ఛమైన భూగర్భ జలాలు లభించేవి. గెడ్డ కూడా గతంలో విశాలంగా ఉండేది. ఇప్పుడు విస్తీర్ణం తగ్గిపోగా, తుప్పలు, ముళ్ల కంపలు పేరుకుపోవడంతో ఎక్కడికక్కడే నీరు నిలిచిపోతోంది. గెడ్డ నీరు కలుషితం కావడం వల్ల సమీపంలోని బోరుబావుల నుంచి వస్తున్న తాగునీరు దుర్వాసన వస్తోంది. మరోవైపు భవన నిర్మాణ వ్యర్థాలను గెడ్డలో పారబోస్తుండడంతో పరిసరాలు మరింత దుర్గంధంగా తయారవుతున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి గెడ్డలో పూడికలు తీయించడంతో పాటు గెడ్డ పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



గెడ్డలో పడవేసిన భవన నిర్మాణ వ్యర్థాలు

సింహగిరిపై ఖాళీ మద్యం సీసాలు



గజపతి సత్రం వెనుక మొక్కల్లో లభించిన ఖాళీ సీసాలు

సింహాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :సింహగిరిపై కొందరు ఆకతాయిలు యథేచ్ఛగా మద్యం సేవించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. సరైన భద్రత, నిఘా వ్యవస్థ లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. సింహగిరిపై గజపతి సత్రంలో ఆదివారం రాత్రి పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. వాటికి హాజరైన వారిలో కొందరు అదే సత్రానికి వెనుక ఉన్న హిల్ టాప్ రోడ్డులో మద్యం సేవించారు. సాధారణ రోజుల్లో కూడా కారు పార్కింగ్ సమీపంలో పాదాలమ్మ, బంగారమ్మ ఆల యాలకు చేరువలోని ఖాళీ స్థలంలో, ఘాట్‌రోడ్డులోని పలు ప్రాం తాల్లో నిత్యం మద్యం సేవిస్తున్నారు. ఈ విషయమై పోలీసులు, దేవస్థానం అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంతో విమర్శలు వ్యక్త మవుతున్నాయి.

నిత్యాన్న ప్రసాద పథకానికి విరాళం



విరాళం అందిస్తున్న దాత

సింహాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి ముగ్గురు దాతలు వేర్వేరుగా రూ. లక్ష చొప్పున మొత్తం రూ. 3 లక్షలు విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన హాస్య మూవీస్ ప్రతినిధులు రాజేశ్ దండా, అపర్ణ దండా, శాన్వి, హాస్య ముగ్గురు రూ.1,00,116 చొప్పున మూడు చెక్కుల ద్వారా దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావుకు సోమవారం అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం అధికారులు స్వామి వారి అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి పద్మనాభరాజు, పీఆర్‌ఓ అప్పలనాయుడు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలని ఫిర్యాదు

పద్మనాభం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరేచోటకు తరలించాలని స్థానికులు కోరారు. సోమవారం వారు కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. మద్యం దుకాణం జనావాసాల మధ్య ఉండడం వల్ల మందుబాబులు నానా దుర్భాషలు ఆడడమే కాకుండా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తున్నారని చెప్పారు. మరికొందరు సీసాలను రోడ్డుపై పగలగొట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తక్షణమే దుకాణాన్ని వేరేచోటకు తరలించాలని కోరారు.

నాన్నమ్మ చెంతకు చేరిన బాలిక

ఎండాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలిక మిస్సింగ్ కేసు కలకలం రేపింది. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. పెద రుషికొండకు చెందిన కొండా ఝాన్సీ (9) ఆదివారం అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చేసి. రుషికొండలోని రహదారిపై ఏడుస్తూ కూర్చుని ఉండడాన్ని అటుగా వెళ్లే ఇద్దరు అన్నదమ్ములు గుర్తించారు. బాలికను వివరాలు అడగ్గా తగరపువలస వెళ్లాలని చెప్పింది. ఆమెకు జ్వరం ఉండడంతో వారు సమీపంలోని తమ ఇంటికి తీసుకువెళ్లి ఆహారం ఇచ్చి, మందులు వేశారు. ఉదయం వరకు ఇంట్లోనే ఉంచి పూర్తి వివరాలు సేకరించారు. భీమిలి దగ్గర వలందపేటలో తన నాన్నమ్మ ఉంటుందని చెప్పడంతో అక్కడికి తీసుకువెళ్లి అప్పగించారు. కాగా అప్పటికే పోలీసు కంట్రోల్ రూమ్‌కి బాలిక తప్పిపోయిందని సమాచారం రావడంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. రుషికొండ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా ఆమె ఒంటరిగా వెళ్లడాన్ని గమనించి, కిడ్నాప్ కాదని నిర్ధారణకు వచ్చారు. బాలికను తల్లి ప్రేమగా చూడకపోవడంతో ఆమె బయటకు వచ్చినట్టు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. బాలిక నాన్నమ్మ దగ్గర ఉంటానని చెప్పడంతో ఆమెకు అప్పగించారు.



ఎమ్మెల్యే గంటాకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న సభ్యులు

వరద బాధితులకు రూ. 50 వేలు విరాళం

కొమ్మాది, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని వరద బాధితులకు మధురవాడ పౌర సంక్షేమ సంఘం సభ్యులు ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈమేరకు విరాళం మొత్తం రూ. 50 వేలను వారు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు సోమవారం ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసంలో అందజేశారు. ఈ సహాయాన్ని సీఎం సహాయ నిధికి అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశ్, బెల్లపు పాపారావు, వెంకటరమణ, జగన్మోహన్, నాగేశ్వరరావు, ఆశాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సమాజ రక్షణలో పోలీసుల పాత్ర కీలకం



స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

కొమ్మాది, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణలో ఎందరో పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పనిచేశారని కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో ఆయన అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుల త్యాగాలు నిరుపమానమని, సమాజ రక్షణలో వారి సేవలు కీలకమని కొనియాడారు. కార్యక్రమంలో జోన్-2 ఏడీసీ సింహాచలం, బాబా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె. సత్యనారాయణ, అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్ ఇలియాసాగర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

బస్సుల నిర్వహణలో లోపాలు ఉండకూడదు

ఆర్టీసీ విశాఖ రీజియన్ ఇన్‌చార్జి మేనేజర్ అప్పలనాయుడు



అధికారులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించి వారి మెప్పు పొందినప్పుడే సంస్థ ప్రతిష్ఠ పెరుగుతుందని ఆర్టీసీ విశాఖ రీజియన్ ఇన్‌చార్జి మేనేజర్, విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్ అండ్ ఆపరేషన్స్) బి. అప్పలనాయుడు అన్నారు. సోమవారం ఆయన మధురవాడ డిపో, ద్వారకా బస్‌స్టేషన్ లాజిస్టిక్స్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్సుల నిర్వహణ, లాజిస్టిక్స్ వాహనాల నిర్వహణలోనూ ఎటువంటి లోపాలు ఉండకూడదన్నారు. ప్రయాణికులు, లాజిస్టిక్స్ సేవల వినియోగదారులు ఆదరించినప్పుడే సంస్థ బలోపేతమవుతుందని చెప్పారు. సేవల్లో లోపాలు ఉంటే ప్రయాణికులు ప్రత్యామ్నాయాలను చూసుకుంటారని, దీనివల్ల సంస్థకు ఆదాయం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్, ఇంజినీరింగ్, లాజిస్టిక్స్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'జూట్‌మిల్లు నుంచి ఆస్తి పన్ను వసూలు చేయాలి'

తగరపువలస, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు భీమిలి జోనల్ కార్యాలయానికి బకాయిపడిన రూ. 26 కోట్లు ఆస్తి పన్నును తక్షణమే వసూలు చేయాలని టీడీపీ విశాఖ పార్లమెంటరీ కార్యదర్శి పిట్ట సురేష్ కోరారు. సోమవారం ఆయన జోనల్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పన్ను బకాయిలు పెండింగ్‌లో ఉంటుండగానే మిల్లు యాజమాన్య ప్రతినిధులకు భూముల అమ్మకానికి ఎన్‌ఓసీలు ఇస్తున్నారని తెలిపారు. మిల్లు భూములున్న 83 అసెస్‌మెంట్లలలో ఆస్తి పన్ను బకాయి రూ. 26 కోట్లు మేర ఉన్నప్పటికీ ఏకపక్షంగా భవనాలను నేలమట్టం చేసి భూములు అమ్మకాలు చేస్తున్నారని చెప్పారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉండిపోయాయని, ఈ విషయంలో అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ధరల నియంత్రణ బాధ్యత ప్రభుత్వానిదే : సీపీఐ



పాత మధురవాడ మెట్టపై ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

మధురవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలను అదుపు చేయడం ప్రభుత్వం బాధ్యత అని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. అధిక ధరలకు నిరసనగా పాత మధురవాడ మెట్టపై సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట నూనెలు, పప్పులు, ఉల్లి, టమాటా ధరలు అమాంతం పెరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఉంటుందని విమర్శించారు. సరకులపై రాయితీలు ప్రకటించి, రేషన్ దుకాణాలు ద్వారా విక్రయిస్తే బహిరంగ మార్కెట్‌లో కొంతవరకు ధరలు తగ్గుముఖం పడతాయని తెలిపారు. అలాగే కొన్ని సరకులుపై రాయితీలు నేరుగా వినియోగదారులకే ఇస్తే ప్రజలకు అదనపు భారం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ర్యాలీలో భాగంగా నాయకులు అధిక ధరలపై ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థినుల ఎంపిక

ఆనందపురం, అక్టోబరు 21 (అక్టోబరు) : మండలంలోని శిర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల క్రీడల అసోసియేషన్ నిర్వహించిన జూనియర్ ఖోఖో ఎంపిక పోటీల్లో శిర్లపాలెం పాఠశాలకు చెందిన పోతల వాగ్దేవి (రామునేనిపేట), రేగిన రేవతి (రేగానిగూడెం) ప్రతిభ చూపారు. ఈమేరకు వారిని ఈనెల 25 నుంచి 27 వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేశారు. బాలికలను వ్యాయామ ఉపాధ్యాయుడు బుత్తల సత్యం, హెచ్‌ఎం శారద, సర్పంచ్ శిర్ల అప్పలనాయుడు తదితరులు అభినందించారు.

అప్పన్న దర్శనానికి తరలివచ్చిన పశ్చిమబెంగాల్ పర్యాటకులు

సింహాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పశ్చిమ బెంగాల్‌కు చెందిన భక్తులు సోమవారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఏటా శరన్నవరాత్రులు ప్రారంభం నుంచి బెంగాల్ పర్యాటకుల రాక ప్రారంభమై సుమారు నలభై రోజుల పాటు కొనసాగుతుంది. ఈమేరకు గత నాలుగు రోజులుగా వస్తున్న బెంగాల్ పర్యాటకులతో సింహగిరి కిటకిటలాడుతోంది.

ముడి వీడుతోంది..!





నవ దంపతుల్లో పెరుగుతున్న అసహనం

- కొరవడుతున్న సర్దుకుపోయే తత్వం
- వేగంగా విస్తరిస్తున్న విడాకుల సంస్కృతి
- వివాహమైన ఐదేళ్లలోపే పెటాకులు

భారతీయ వైవాహిక వ్యవస్థకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు, గౌరవం ఉన్నాయి. సంప్రదాయాలు, ఉమ్మడి కుటుంబాలు, పిల్లలపై తల్లిదండ్రుల ప్రేమ ఇలా అనేక అంశాలు దంపతుల మధ్య బంధం బలపడేందుకు దోహదపడుతూ వచ్చాయి. ముఖ్యంగా కాపురాలు సవ్యంగా సాగడానికి, సర్దుకుపోయే మనస్తత్వం అలవడేందుకు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఎంతో దోహదపడింది. అయితే పాశ్చాత్య పోకడలు విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో విడాకుల సంస్కృతి వేళ్లూనుకుంటోంది. మాట పట్టింపులు, చిన్న చిన్న విషయాలు దంపతుల మధ్య చిచ్చు పెడుతున్నాయి. ఫలితంగా కోర్టుకు ఎక్కేవారి సంఖ్య పెరుగుతోంది.

పెళ్లంటే..పందిళ్లు, సందళ్లు, తప్పెట్లు, తాళాలు, తలంబ్రాలూ... మూడే ముళ్లు, ఏడే అడుగులు...మొత్తం కలిసీ నూరేళ్లు! ఇప్పటికీ ఈ పాటకు విశేష ప్రజాదరణ ఉంది. కానీ ప్రస్తుతం మనుషుల ఆలోచనలు మారిపోతున్నాయి. స్పీడ్ యుగంలో అన్నీ తొందరగా అయిపోవాలనే తపన పెరుగుతోంది. ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ ఇచ్చినంత వేగంగానే జీవితంలో అన్నీ జరిగిపోవాలని ప్రస్తుత తరం తలుస్తోంది. ఫలితంగా వివాహ బంధానికి విలువ లేకుండా పోతోంది. చిన్న చిన్న కారణాలకూ దంపతులు విడిపోవడం సాధారణమైపోయింది. ఏటా విడాకుల కోసం కోర్టుకు ఎక్కే జంటల సంఖ్య 20 శాతం మేర పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

విపరీత ధోరణి...

విడాకుల కోసం ఎదురుచూడడమే కాదు, మంజూరైన తర్వాత సంబరాలు చేసుకునే సంస్కృతి కూడా పెరుగుతోంది. కొందరైతే సోషల్ మీడియాలో పంచుకునేందుకు వెనుకాడడం లేదు. నచ్చనప్పుడు రాజీ పడాల్సిన అవసరమేమిటనే ధోరణి బలపడుతోంది. జిల్లా ఫ్యామిలీ కోర్టులో అధికశాతం విడాకుల కేసులే నమోదవుతున్నాయి. ఇందులో వివాహమై ఐదేళ్లు కూడా సంసారం చేయని జంటలే అధికం. వివాదాలు స్వల్పమే అయినా, పెద్దలు చేసే రాజీ ప్రయత్నాలు ఫలితమివ్వడం లేదు. కొన్నిజంటల్లో ఇద్దరూ ఉద్యోగులు కావడంతో సమయం చాలక, ఇంట్లో పనులు ఎవరు చేయాలన్న విషయంపై మొదలయ్యే వాగ్వాదాలు చివరకు విడాకుల వరకు దారితీస్తున్నాయి. ఇలాంటి కొన్ని కారణాలను పరిశీలిస్తే ఇంత చిన్న అంశాలకూ విడిపోవాలా అనిపిస్తుంది. దంపతుల మధ్య సర్దుకుపోయే మనస్తత్వం కొరవడడం జీవితాలను కబళిస్తోంది.

కొన్ని ఉదాహరణలివి...

- భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులే. ఒకరు ముంబైలో, మరొకరు హైదరాబాద్‌లో...కలిసి ఉండాలంటే ఎవరో ఒకరు ఉద్యోగం మానేయాలి. దీనిపై ఇద్దరి మధ్య అంగీకారం కుదరలేదు. విడాకులు తీసుకోవడమే మేలనుకున్నారు.
- దంపతులు ఉద్యోగులు. అందంగా ఉండడం కోసం మేకప్, ట్రెండీ వస్త్రధారణ ఆమెకు ఇష్టం. అక్కడే గొడవలు ప్రారంభం. తన తల్లిదండ్రులను సరిగా చూడడం లేదని భర్తకు కోపం. ఫలితం విడాకులు.
- భర్త ప్రతి చిన్నదానికీ కోప్పడతాడు. కన్నవారింటికి పంపించడానికి కూడా ఇష్టపడడు. చేతికి డబ్బులివ్వడు. ఫోన్ మాట్లాడనివ్వడు. దీంతో పెళ్లైన మూడు నెలలకే పుట్టింటికి తిరిగొచ్చి, పోలీసు కేసు, విడాకులు.
- భర్తకు రూ.50 వేలు జీతం. మంచి జీవితం గడపాలనుకుని మరింత ఆదాయం వచ్చే ఉద్యోగంలో చేరాలని చెప్పినా వినలేదు. వాగ్వాదాలతో తరచూ దూరమయ్యే దంపతులు విడాకులే పరిష్కారమని కోర్టుకు వెళ్లారు.
- వివాహమై ఏడాదిన్నరైనా పిల్లలు లేరు. ఒకరిపై ఒకరికి అనుమానం. నిత్యం ఫోన్లపై నిఘా. సమస్య సద్దుమణగలేదు. చివరకు పెళ్లి పెటాకులైంది.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం విడాకులకు ప్రధాన కారణంగా నిపుణులు పేర్కొంటున్నారు. భార్యాభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు, మనస్పర్థలు సాధారణమేనని, ఒక ఇంట్లో తల్లిదండ్రులు, పిల్లల మధ్య కూడా భిన్నాభిప్రాయాలు ఉంటాయని, వేర్వేరు కుటుంబాల నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తుల మధ్య అభిప్రాయ భేదాలు సాధారణమేనని అంటున్నారు. ఉమ్మడి కుటుంబాల్లో పెద్దలు సర్దిచెప్పేవారు. దీంతో దంపతులు తమ మాట బయటకు రావడానికి వందసార్లు ఆలోచించేవారు. పెద్దలున్నారనే గౌరవమో, అభిమానమో, భయమో వారిని కట్టి ఉంచేవి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. చిన్నచిన్న కుటుంబాలుగా మారిపోవడం, పెద్దలకు సరైన గౌరవ మర్యాదలు లభించకపోవడం వంటి అంశాలు ప్రతి చిన్న అంశాన్నీ పెద్దదిగా చూపిస్తున్నారు. ఫలితంగా విడిపోయేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో విడాకుల వరకూ వస్తున్న కేసుల్లో అధికశాతం విద్యావంతులు, ఉద్యోగులదేనని చెబుతున్నారు. ఈ సంస్కృతి నగరాలు, పట్టణాల్లో విపరీతంగా పెరుగుతోందంటున్నారు. విడాకులు తీసుకోవడం చట్టబద్ధమైన హక్కే. కానీ దాని వల్ల వచ్చే చిక్కులను గుర్తించి, పెద్దల సలహాలను తీసుకోవాలని, తప్పనిసరైతేనే విడిపోవాలని నిర్ణయించుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

● ఎం.వి.పి.కాలనీ, ఆంధ్రజ్యోతి

సర్దుకుపోవడం లేదు



దంపతుల్లో సర్దుకుపోయే మనస్తత్వం కొరవడుతోంది. చిన్నచిన్న కారణాలకే పరస్పర అంగీకారంతో విడాకులకు ముందుకు వస్తున్నారు. ఎదుటివారి మాటకు విలువ ఇవ్వకపోవడం, స్వేచ్ఛ కావాలనుకోవడం, తల్లిదండ్రులకు ప్రాధాన్యత ఇవ్వలేకపోవడం, ఉద్యోగం లేదా వృత్తి రీత్యా భార్యాభర్తల మధ్య దూరం పెరగడం, కుటుంబసభ్యుల మాటలకు ప్రభావితం కావడం వంటి కారణాలే కనిపిస్తున్నాయి. విడాకులు తీసుకున్నానని చెప్పుకోవడానికి ఎవరూ సంకోచించడం లేదు. గతంలో పోలీసు ఫిర్యాదులు, న్యాయస్థానాల్లో కేసులు, విచారణ అనంతరం విడాకులు తీసుకునేవారు. ప్రస్తుతం భార్యా భర్తల్లో విభేదాలు తారాస్థాయికి చేరడమో, ఇతరత్రా కారణాలతోనో విడాకులకు అంగీకరించి ముందుకు వస్తున్నారు. ఇలాంటి కేసులు నెలకు ఐదు వరకు వస్తున్నాయి.

- సూరిశెట్టి సరోజ, లీగల్ కౌన్సెలర్, డొమస్టిక్ వయలెన్స్, మహిళా శిశు సంక్షేమ శాఖ

బైక్ కొనలేదని విద్యార్థి ఆత్మహత్య



గణేశ్ (ఫైల్‌ఫొటో)

ఎండాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తన పుట్టిన రోజుకు తల్లిదండ్రులు బైక్ కొన లేదని ఓ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గాయత్రినగర్ డీఆర్‌ఎం కాలనీకి చెందిన పేరిశెట్టి గణేశ్ (17) మధురవాడలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి సత్యనారాయణ వంట మాస్టారుగా పనిచేస్తున్నాడు. సోమవారం గణేశ్ పుట్టినరోజు కావడంతో తల్లిదండ్రులను బైక్ కొనమని కోరాడు. కొద్ది రోజుల తరువాత కొందామని తండ్రి చెప్పారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ ఉద్యోగి ఆత్మహత్య



పద్మనాభరావు (ఫైల్)

భీమునిపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై రెవెన్యూ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శీలా అనంత పద్మనాభరావు (55) కొంతకాలంగా అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. శనివారం గాజువాకలో కోర్టు వాయిదాకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి ఆదివారం కూడా ఇంటికి చేరలేదు. సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి అతని భార్య విశాలాక్షికి ఫోన్ వచ్చింది. ఆదివారం రాత్రి బీచ్‌రోడ్డు కొబ్బరితోట పార్క్ శ్మశాన వాటిక వెనుక భాగంలో అపస్మారక స్థితిలో ఉన్న అతడిని ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్‌ఐ సత్తిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అయోడైజ్డ్ ఉప్పునే వినియోగించాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హోటల్స్‌లో తయారు చేసే ఆహారపదార్థాల్లో అయోడైజ్డ్ ఉప్పునే వినియోగించాలని, వ్యాపారులు దానిని మాత్రమే విక్రయించాలని జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జీబీ నందాజీ పేర్కొన్నారు. ప్రపంచ అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు విశాఖపట్నం హోటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వ్యాపారులు, విక్రయదారులకు ద్వారకానగర్‌లోని అసోసియేషన్ మీటింగ్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ స్టాండర్ట్స్ యాక్ట్ ప్రకారం అయోడైజ్డ్ ఉప్పు కాకుండా సాధారణ ఉప్పును విక్రయిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అయోడైజ్డ్ సాల్ట్‌ను వేడి ప్రదేశాల్లో, బయట ఉంచకూడదన్నారు. దీనిని వినియో గించడం వల్ల గాయిటర్‌తోపాటు అనేక వ్యాధులు రావన్నారు. కార్యక్రమంలో న్యూట్రీషియన్ ఇండియా సంస్థ ప్రతినిధి డాక్టర్ రమేష్, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు డి.వేణుగోపాలరావు, కె.సతీష్‌కుమార్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు జీవీ అప్పారావు, టి.శ్రీను, ఎస్.ఆనందరావు, హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి శివారెడ్డి పాల్గొన్నారు.

నేడు విమ్స్‌లో రొమ్ము కేన్సర్‌పై అవగాహన శిబిరం

ఆరిలోవ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రొమ్ము కేన్సర్ అవగాహన మాసం పురస్కరించుకొని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో మంగళవారం అవగాహన శిబిరం నిర్వహిస్తున్నట్టు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. రొమ్ము కేన్సర్‌ను నిర్ధారించే వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా బ్రెస్ట్ అల్ట్రా సౌండ్, బయాప్సీ పరీక్షలు చేసి మందులు ఇస్తామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ బ్లాక్‌లో శిబిరం నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీఎంఆర్‌డీఏ డీఎఫ్ఓ శాంతిస్వరూప్ బదిలీ

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) డీఎఫ్ఓ శాంతి స్వరూప్‌కు రాజమండ్రి బదిలీ అయింది. గత నాలుగేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్న అతనిని ప్రభుత్వం రాజమండ్రిలోని ఫారెస్ట్ ట్రైనింగ్ సెంటర్‌కు బదిలీ చేసింది. ఉత్తర్వులు అందిన వెంటనే రిలీవై వెళ్లిపోయారు. ఇక్కడి పోస్టులో ఇంకా ఎవరినీ నియమించలేదు.

నేటి నుంచి ఆధార్ అప్‌డేట్‌కు క్యాంపులు

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఆధార్ అప్‌డేట్‌కు జిల్లాలో మంగళవారం నుంచి 25 వరకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల విభాగం ద్వారా నిర్వహించే క్యాంపులను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో 2,91,628 మంది బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని, వారంతా సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. ఐదు నుంచి 15 ఏళ్ల మధ్య పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయాలన్నారు.

నగరంలో ఉప ముఖ్యమంత్రి పవన్ పర్యటన



రుషికొండ ప్యాలెస్ వద్ద ఫొటోలు తీస్తున్న డిప్యూటీ సీఎం



రుషికొండ ప్యాలెస్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్



విమానాశ్రయంలో పవన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, సీపీ

ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ సోమవారం నగరంలో పర్యటించారు. విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు కలెక్టర్, సీపీ, జీవీ ఎంసీ కమిషనర్, టీడీపీ, జనసేన నేతలు స్వాగతం పలికారు. తిరుగుప్రయాణంలో పవన్‌కల్యాణ్ రుషికొండలో గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా నిర్మించిన ప్యాలెస్‌ను ఎంపీ శ్రీభరత్‌తో కలిసి సందర్శించారు. దాని వివరాలను తెలుసుకున్నారు.

-విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

సురక్షిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి: సీపీ



అమరవీరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, సీపీ, తదితరులు



పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించడంతోపాటు నగరంలో అసాంఘిక కార్యక్రమాలు, సంఘవిద్రోహశక్తులకు అవకాశం లేకుండా చేయడం ద్వారా విశాఖను దేశంలోనే సురక్షిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్టు నగర పోలీస్‌కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా బీచ్‌రోడ్డులోని అమరవీరుల స్థూపం వద్ద కలెక్టర్ హరేంధిరప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి అమరులైన పోలీసులకు నివాళులర్పించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీసులతో సమర్థంగా విధులు నిర్వర్తించేలా చూడడంతోపాటు, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. నగరంలో ట్రాఫిక్‌ను మెరుగుపరచి ప్రమాదాలను నియంత్రించామన్నారు. సర్వీసులో ఉండగా మరణించిన సిబ్బంది కుటుంబసభ్యులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఏఆర్ సిబ్బంది నిర్వహించిన పరేడ్ ఆకట్టుకుంది.

మద్యం దుకాణాల ఏర్పాటుపై నిరసన

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల ఏర్పాటుపై స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తోంది. జనావాసాల మధ్య ఏర్పాటుతో ఇబ్బందులు ఎదుర్కొంటామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికకు జిల్లాలో ఐదు ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందాయి. అల్లిపురం భూపేష్‌నగర్‌లో మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. పద్మనాభం మండలం మద్దిగ్రామంలో జనావాసాల మధ్య దుకాణం ఏర్పాటును నిరసిస్తూ మహిళలు ఆందోళన వ్యక్తంచేశారు. అక్కయ్యపాలెం మహారాణిపార్లర్ డౌన్‌లో దుకాణం ఏర్పాటు చేయవద్దని స్థానికులు వినతిపత్రం అందజేశారు. గోపాలపట్నం సమీప కొత్తపాలెంలో పాఠశాలల మధ్య మద్యం దుకాణం ఏర్పాటును రద్దుచేయాలని కోరారు. వడ్లపూడి ఏరియాలో దుకాణం ఏర్పాటుపై స్థానికులు నిరసన తెలిపారు. చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖను కలెక్టర్ ఆదేశించారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

» అధికార యంత్రాంగానికి కలెక్టర్ సూచన



సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు

మహారాణిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒకే సమస్యపై ఫిర్యాదులు మళ్లీ మళ్లీ రాకుండా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 230 వినతులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూ విభాగానికి సంబంధించి 84, జీవీఎంసీ 65, పోలీసు 12, ఇతర శాఖలకు సంబంధించి 69 అర్జీలు అందినట్టు తెలిపారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో మోహనకుమార్, ఆర్డీవో శ్రీలేఖ, అధికారులు పాల్గొన్నారు.

జీతం బకాయిలు చెల్లించాలని డిమాండ్

జీతం బకాయిలు చెల్లించాలని 108 ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈఎమ్‌టీగా పనిచేస్తున్న వారి సేవలను పరిగణనలోకి తీసుకొని వైద్య ఆరోగ్యశాఖ ద్వారా వైద్య కళాశాలల్లో నియమించాలని కోరారు.

అమ్మఒడి లేదు.. ప్రభుత్వమే చెల్లించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతం చెల్లించడం లేదని, సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

వైకల్యం 85 శాతం దాటితే రూ.15 వేల పింఛన్ ఇవ్వాలి

జిల్లాలో 85 శాతం వైకల్యం ఉన్నవారికి రూ.15 వేల పింఛన్ అందించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. కలెక్టరేట్‌లో ఆందోళన నిర్వహించిన అనంతరం వినతి పత్రాన్ని అందించారు.

జీవీఎంసీలో 77 వినతులు...

వెంకోజీపాలెం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 77 వినతులు వచ్చాయని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో అధికారులతో కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి, ఆయా శాఖల అధికారులకు వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

విజేతలకు కలెక్టర్ అభినందన



వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలతో కలెక్టర్, జేసీ, డీఈవో, తదితరులు

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 విజన్‌పై మండలస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలను కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ సోమవారం అభినందించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రశంసాపత్రాలు, మెడల్స్ ప్రదానంచేశారు. వ్యాసరచనలో కె.విరాజితకు ప్రథమస్థానం (చింతల అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాల), ఎల్.జ్యోత్స్న ద్వితీయ స్థానం (ఆనందపురం కేజీబీవీ), ఎం.సిద్రసుల్తానా (క్వీన్‌మేరీస్ ఉన్నత పాఠశాల),తృతీయస్థానం, వక్తృత్వంలో కె.సుహాసిని గీతిక, కె.వర్షిణి (నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాల) ప్రథమ స్థానం, కె.సుస్మితప్రియాంక, జేవీఎస్ ప్రీతికి ద్వితీయ స్థానం (చిట్టివలస జడ్పీ పాఠశాల), జె.భీవ్‌సారీ, ఎస్.అక్షయ తృతీయ స్థానం (సునీల్‌శర్మ కాలనీ ఉన్నత పాఠశాల) నిలిచారు. వక్తృత్వ పోటీలలో ఆర్. భరద్వాజ (ప్రకాశరావుపేట మునిసిపల్ ఉన్నత పాఠశాల) ప్రథమస్థానం, పి. అచ్యుతరావుకు ద్వితీయస్థానం (పెదనరవ బీసీ డబ్ల్యు స్కూలు), కె.సుహాసిని గీతిక (నడుపూరు ఉన్నత పాఠశాల) తృతీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహనకుమార్, ఆర్డీవో డాక్టర్ పి.శ్రీలేఖ, డీఈవో ఎల్.చంద్రకళ, జిల్లా బీసీ సంక్షేమాధికారి బి.శ్రీదేవి, సమగ్రశిక్షా అభియాన్ ఏఎంవో జి.లక్ష్మి పాల్గొన్నారు.

మునగ ఆకులతో ఆరోగ్యానికి మేలు: కలెక్టర్

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మునగచెట్టు, ఆకులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ ఆకుల్లోని పోషక విలువలు తెలియజేసే పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఐసీడీఎస్ పీడీ జయదేవి మాట్లాడుతూ మునగచెట్టు, ఆకులతో ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. ఐరన్, ప్రొటీన్, విటమిన్ ఏ, సీ, ఈ, విటమిన్ బీ1, బీ2, బీ3, బీ6, కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం లభిస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవో, డీఈవో ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేవీలో వైద్య పరీక్షల కేంద్రం ప్రారంభం



వైద్య పరీక్షల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రియర్ అడ్మిరల్ అజిత్ గోపీనాథ్

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళంలోని ఐఎన్ఎస్ వీరబాహులో కొత్తగా నిర్మించిన ఆధునిక వైద్య పరీక్షల కేంద్రాన్ని కమాండ్ మెడికల్ ఆఫీసర్ సర్జన్ రియర్ అడ్మిరల్ అజిత్ గోపీనాథ్ సోమవారం ప్రారంభించారు. ఇందులో ఆధునిక వైద్య పరికరాలు, ఆయుష్రవిధ క్లినిక్ ఉన్నాయని, నేవీ ఉద్యోగుల కుటుంబాలకు అత్యున్నత వైద్యసేవలు అందుతాయన్నారు.

ఉపాధి లభించే కోర్సులు ప్రవేశపెట్టాలి

» జీఎంఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ స్మిత రాజు



స్మితరాజును సత్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉపాధి అవకాశాలను కల్పించే భిన్నమైన కోర్సులను ప్రవేశపెట్టాలని జీఎంఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ స్మిత రాజు సూచించారు. వర్సిటీని సోమవారం సందర్శించిన ఆమె అధికారులతో సమావేశమయ్యారు. భిన్నమైన కోర్సుల రూప కల్పనకు ఏయూ సహకరించాలన్నారు. వీసీ శశిభూషణరావు మాట్లాడుతూ డ్యూయల్ డిగ్రీ విధానాన్ని అమలు చేస్తున్నామని, దీని ప్రాధాన్యత, లాభదాయకంగా నిలిచే విధానం ఆమెకు వివరించారు. దేశంలో మేధో వలసలు తగ్గించడానికి ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. డ్రగ్ టెస్టింగ్, ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల పనితీరు, విద్యార్థులను భాగస్వాములను చేస్తూ పరిశ్రమలతో అనుసంధానించేలా కృషి చేస్తున్న విధానాన్ని వివరించారు. నూతన కోర్సుల రూపకల్పనకు కృషిచేస్తున్నామన్నారు. ఆ హబ్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మైటీ సీతఈవోలను స్మిత సందర్శించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు, సీఈవో రవి ఈశ్వరప్ప, పూజ విద్యాశంకర్, ప్లేస్‌మెంట్ అధికారులు డాక్టర్ చల్లా నరసింహం, వీఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.